(PRGI) NO APTEL : 2023/89019

# ఇన్నర్ వ్యూ

తెలుగు దిన పత్రిక

INNER VIEW TELUGU DAILY

RIYA FOUNDATION CHARITABLE TRUST

సంపుటి :02 సంచిక : 172 పేజీలు : 8 సంపాదకులు : ములకలపల్లి రాజు (ఎం.డి. రాజు) ప్రచురణ : అనకాపల్లి బుధవారం 18 మార్చి 2026 వెల : 8/- రూ॥

VOLUME: 02 ISSUE : 172 PAGES: 8 EDITOR: MULAKALAPALLI RAJU( M.D. RAJU) PUBLISHED: ANAKAPALLI WEDNESDAY 18 March 2026 PRICE : 8/- RS

Published From : Anakapalli, Circulated by Srikakulam, Vizianagaram, Manyam Dist, Visakhapatnam, Alluri seetaramaraju Dist

## మళ్లీ పెట్టుబడుల జోరు పెంచుతాం..

### 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం: మంత్రి లోకేశ్



**అమరావతి, ఇన్నర్ వ్యూ**

రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే ఏకైక లక్ష్యంగా పనిచేయాలని, ఒప్పందాలకే పరిమితం కాకుండా పెట్టుబడులు క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చేలా కృషి చేయాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళగిరి సమీపంలోని చినకాకాని మయూరి టెక్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ) నూతన కార్యాలయాన్ని ఆయన ఇవాళ ప్రారంభించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం ఏపీఈడీబీ అధికారులతో సమావేశమైన లోకేశ్, ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించారు. "యువగళం పాదయాత్రలో యువతకు 20 లక్షల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాను. జీడీ నెల్లూరులో బజ్జీలు అమ్ముకునే మోహన అనే మహిళ నన్ను కలిసి, ప్రభుత్వ సాయం వద్దని, తన పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తే చాలని కోరారు. ప్రజల ఆకాంక్ష ఇదే. అందుకే ఉద్యోగాల కల్పనే మన సింగిల్ పాయింట్ ఎజెండా కావాలి" అని లోకేశ్ ఉద్ఘాటించారు. గత ప్రభుత్వం ఏపీఈడీబీని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆయన విమర్శించారు. గత టీడీపీ హయాంలో కేవలం 20 నెలల

తరువాయి 2లో..

## అధికారంలోకొస్తే

## పార్టీ కార్యకర్తలకే పెద్దపీట

### ఒంగోలు వైకాపా నేతల సమావేశంలో జగన్

### ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని వ్యాఖ్య




**అమరావతి, ఇన్నర్ వ్యూ**

'రికార్డు స్థాయిలో అప్పులు చేస్తూ, ఏ ఒక్క వర్గానికీ మేలు చేయని కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి మొదలైంది' అని మాజీ ముఖ్యమంత్రి జగన్ అన్నారు. గతంలో

తరువాయి 2లో..

## 'మాకు ఎవరి అవసరం లేదు'

### మిత్ర దేశాల షాక్ వేళ ట్రంప్ వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, ఇన్నర్ వ్యూ**

ఇరాన్‌తో యుద్ధం వేళ.. బలప్రయోగం ద్వారా హర్మూజ్ జలసంధిని తెరిపించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్

తరువాయి 2లో..

## డాలర్ చాప కిందికి చమురు?

### చైనా కరెన్సీలో చెల్లిస్తే

### హర్మూజ్ దాటేందుకు అనుమతి

### అమెరికా ఎత్తులకు ఇరాన్ పైఎత్తు?

### ట్రంప్‌పై స్వదేశంలో ఒత్తిడి పెంచే వ్యూహం



**న్యూస్ డెస్క్, ఇన్నర్ వ్యూ**

ఎలాగైనా సరే ఇరాన్ మెడలు వంచాలని అమెరికా చూస్తుంటే... ట్రంప్ మెడకే యుద్ధ ప్రభావం గట్టిగా చుట్టుకునేలా ఇరాన్ పావులు కదుపుతోంది! వెరసి పశ్చిమ ఆసియా యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను కుదిపే దిశగా సాగుతోంది! పైకి డ్రోన్లు, క్షిపణులతో మధ్య ఆసియా యుద్ధాన్ని కొనసాగిస్తున్న ఇరుపక్షాలు... లోలోన ఆర్థిక అస్త్రాలకు పదును పెడుతున్నాయి. ఇరాన్‌కు చమురు జీవనాడి అయిన ఖర్గ్ ద్వీపంపై పట్టుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎత్తులు వేస్తుంటే ఏకంగా అగ్రరాజ్య ఆర్థిక ఆధిపత్యానికి మూలమైన డాలర్‌ను దెబ్బతీసేందుకు టెహ్రాన్ పైఎత్తులు వేస్తోంది. డాలర్‌కు పోటీగా... తన మిత్రదేశమైన చైనా కరెన్సీ యువాన్‌ను అంతర్జాతీయ మారకంగా ప్రోత్సహించేలా అడుగులు

తరువాయి 2లో..

## ప్రజలను పార్టీలుగా చూడొద్దు

### ప్రభుత్వాలపై వైఎస్ షర్మిల ఫైర్



**న్యూస్ డెస్క్, ఇన్నర్ వ్యూ**

గత వైసీపీ ప్రభుత్వంపైనా, ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంపైనా ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

తరువాయి 2లో..




### యుద్ధంలో తొలిసారిగా సెజిల్ క్షిపణి ప్రయోగం

**న్యూస్ డెస్క్, ఇన్నర్ వ్యూ**

యుద్ధంలో క్షిపణులు, డ్రోన్లతో ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్న ఇరాన్.. తన దివ్యాస్త్రాన్ని బయటకు తీసింది. డ్యాన్సింగ్ మిసైల్‌గా పేరొందిన సెజిల్ క్షిపణిని తొలిసారిగా ఇజ్రాయెల్, అమెరికా లక్ష్యాలపైకి ప్రయోగించింది. ప్రత్యర్థి గగనతల రక్షణ వ్యవస్థలను అయోమయానికి గురిచేసే ఇలాంటి అస్త్రాలతో యుద్ధ వేడి మరింత పెరగడం ఖాయం.

**ఏమిటీ సెజిల్?**


ఇది రెండంచెల ఘన ఇంధన, మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణి. దీన్ని స్వదేశీ పరిజ్ఞానంతో ఇరాన్ అభివృద్ధి చేసింది. దీనికి చైనా సాయం అందించి ఉండొచ్చన్న వాదన కూడా ఉంది. సెజిల్ అభివృద్ధి 1990ల చివర్లో మొదలైంది. జెల్‌జాల్ వంటి స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణుల రూపకల్పనలో గడించిన అనుభవం ఆధారంగా ఈ ప్రాజెక్టును ఇరాన్ చేపట్టింది. సెజిల్‌లో ఘన ఇంధన వినియోగానికి కూడా ఆ పూర్వ అనుభవం దోహదపడింది. పరిమాణం, బరువు, పరిధి వంటి అంశాలపరంగా ఈ క్షిపణి.. మునుపటి షాహాబ్-3ని పోలి ఉంటుంది. అయితే ఆ అస్త్రం కన్నా ఇది చాలా మెరుగైంది. ఘన ఇంధనాన్ని వాడటం వల్ల సెజిల్‌ను వేగంగా ప్రయోగానికి సిద్ధం చేయవచ్చు. అందువల్ల లాంచింగ్ సమయంలో శత్రుదాడులకు ఇది గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుంది. ఘన ఇంధనాన్ని చాలా ముందుగానే క్షిపణిలో నింపి ఉంచొచ్చు. ద్రవ ఇంధనాల తరహాలో ప్రయోగానికి కొద్దిసేపటి ముందు మాత్రమే నింపాల్సిన అవసరం ఉండదు. ఘన ఇంధన క్షిపణులను చాలా సులువుగా ఒకచోటు నుంచి మరో చోటుకు తరలించొచ్చు. ఘన ఇంధన క్షిపణులకు సంబంధించిన కొన్ని అంశాల కారణంగా.. గాల్లో వాటి నియంత్రణ, మార్గనిర్దేశం చాలా కష్టం. ఈ అవరోధాలను ఇరాన్ ఇంజినీర్లు ఎలా అధిగమించారన్నది అంతుచిక్కకుండా ఉంది. షాహాబ్ గైడెన్స్ వ్యవస్థలను మార్చడం లేదా విదేశీ సాయం తీసుకోవడం వల్ల ఇది సాధ్యమై ఉంటుందని భావిస్తున్నారు.

**విస్తృతంగా పరీక్షలు...:** కొత్త పరిజ్ఞానాలను వాడటం వల్ల సెజిల్‌ను ఇరాన్ విస్తృతంగా పరీక్షించింది. దాని తొలి పరీక్ష 2008లో జరిగింది. నాడు అది 800 కిలోమీటర్లు ప్రయాణించింది. మెరుగైన మార్గనిర్దేశక వ్యవస్థల జోడింపు అనంతరం 2009 మే

తరువాయి 2లో..

## ఏపీలో గ్యాస్ కొరత లేదు, ప్రజలు ఆందోళన చెందవద్దు

### రాష్ట్రంలో 14 వేల టన్నుల ఎల్పీజీ నిల్వలు



**అమరావతి, ఇన్నర్ వ్యూ**

ఇరాన్ యుద్ధం నేపథ్యంలో, రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ నిల్వలు, సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గ్యాస్ కొరతపై ఊహాగానాలు వస్తుండడం పట్ల ఆయన అధికారులతో చర్చించారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 14 వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నాయని, మరో 15 రోజులకు సరిపడా గ్యాస్ అందుబాటులో ఉందని సీఎం వెల్లడించారు. అమరావతిలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, గెయిల్, ఓఎన్జీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆసుపత్రులు, హాస్టళ్లు, ఆలయాలకు గ్యాస్ కొరత రాకుండా నిరంతరాయంగా సరఫరా చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. కేవైసీ, ఓటీపీల ద్వారా సిలిండర్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, యుద్ధ పరిస్థితుల వల్ల అంతర్జాతీయంగా గ్యాస్ సరఫరాపై ప్రభావం పడుతున్నప్పటికీ, రాష్ట్రంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఇండక్షన్ స్టవ్‌ల ఉత్పత్తి, పంపిణీని పెంచి వాటి లభ్యతను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అదే సమయంలో, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను విస్తరించి, కేజీ బేసిన్ గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా ఇళ్లకు సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో గృహ వినియోగానికి గ్యాస్ కొరత లేదని, సరఫరా సజావుగా సాగుతోందని ఆయన పునరుద్ఘాటించారు.

**రాష్ట్రంలో 14 వేల టన్నుల ఎల్పీజీ నిల్వలు...:** రాష్ట్రంలో ప్రస్తుతం 14వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నట్లు

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# టీడీపీ బీఆర్ఎస్ సున్నా... వైసీపీ మాత్రం వామ్మో !

ఒక విషయంలో రెండు తెలుగు రాష్ట్రాలలో టీడీపీ బీఆర్ఎస్ లను వైసీపీ అధిగమించి రికార్డు నెలకొల్పింది. ఏపీలో బలమైన ప్రాంతీయ పార్టీలుగా అధికారం అందుకున్న పార్టీలుగా ఈ మూడు ఉన్నాయి. ఇందులో నాలుగున్నర దశాబ్దాల వయసు కలిగినది టీడీపీ అయితే పాతికేళ్ల ప్రాయం బీఆర్ఎస్ ది. దశాబ్దన్నర ప్రస్తానం వైసీపీది. అయితే నేమి ఆ రెండు పార్టీల కంటే కూడా వైసీపీ ఒక విషయంలో తాను పైచేయి అని చాటుకుంది. ఇంతకీ ఎందులో పైచేయి అంటే అదే ఇంట్రెస్టింగ్ మ్యాటర్ గా ఉంది. ఇక 2024లో ఏపీలో అసెంబ్లీ పార్లమెంట్ లకు కలిపి ఒకేసారి ఎన్నికలు జరిగాయి. తెలంగాణలో మాత్రం లోక్ సభకు ఎన్నికలు జరిగాయి. అయితే ఈ ఎన్నికల్లో టీడీపీ బీఆర్ఎస్ సోషల్ మీడియా కోసం పెట్టిన ఖర్చు ఏమీ లేదు, జస్ట్ జీరో మాత్రమే. అయితే వైసీపీ మాత్రం ఏకంగా 8.26 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లుగా వెల్లడైంది. దీని మీద కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించిన వివరాల ఆధారంగా తీసుకుని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ ఏడీఆర్ సేకరించిన గణాంకాల ప్రకారం ఈ విధంగా లెక్కలు తేలాయి. ఇక 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోషల్ మీడియాపై తాము ఎటువంటి ఖర్చు చేయలేదని టీడీపీ బీఆర్ఎస్ స్పష్టం చేశాయి. అదే సమయంలో వైసీపీ మాత్రం తన ఎన్నికల ఖర్చు ఆ ఎన్నికల్లో 328.37 కోట్లుగా పేర్కొంది. అందులో సోషల్ మీడియా ప్రచారాల కోసం వెచ్చించిన 8.26 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లుగా తెలియచేయడం విశేషం. ఇదిలా ఉంటే ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ఎంతో పవర్ ఫుల్ అన్నది తెలిసిందే. అలా డిజిటల్ ఫ్లాట్ ఫారంగా చలామణీలో ఉన్న ఈ కాలంలో తాము ఒక్క రూపాయి కూడా సోషల్ మీడియా రూపేణా ఖర్చు చేయలేదని టీడీపీ బీఆర్ఎస్ స్పష్టం చేయడం విశేషంగానే ఉంది. అయితే బీఆర్ ఎస్ 2024 ఎన్నికల కోసం పెట్టిన మొత్తం ఖర్చు అయితే 120.14 కోట్లుగా ఉంది. అలాగే టీడీపీ మొత్తం ఖర్చు చూస్తే 35.66 కోట్ల రూపాయలుగా ఉంది. ఇక సోషల్ మీడియా కోసం తాము వెచ్చించామని బీజేపీ సహా మరి కొన్ని పార్టీలు ఎన్నికల సంఘానికి తెలియచేశాయి. బీజేపీ మొత్తం ఎన్నికల ఖర్చు 1,778.70 కోట్ల రూపాయలు ఉంటే అందులో సొషల్ మీడియా ఖర్చు 187.69 కోట్లు ఉండడం గమనార్హం. అలా సోషల్ మీడియా ఫ్లాట్ ఫారానికి దేశంలోనే ఎక్కువ ఖర్చు చేసిన పార్టీగా బీజేపీ నిలిచింది అని అంటున్నారు. ఇక దేశంలో మరో కీలకమైన పార్టీగా ఉన్న కాంగ్రెస్ తన ఎన్నికల ఖర్చుగా 686.19 కోట్ల రూపాయలను చూపించింది. ఇందులో డిజిటల్ ప్రచారాల కోసం 47.69 కోట్ల రూపాయలుగా తెలిపింది. అలాగే ఒడిషాలో బిజు జనతా దళ్ ఎన్నికల ఖర్చు అయితే 278.4 కోట్ల రూపాయలుగా ఉంది. అందులో 3.03 కోట్లు డిజిటల్ ప్రచారానికే వెచ్చించినట్లుగా వివరించింది. ఇక డీఎంకే ఎన్నికల ఖర్చు చొస్తే 145.68 కోట్ల రూపాయలు ఉంది. అందుల సోషల్ మీడియా ప్రచారానికి 50.26 కోట్లు కూడా ఉంది. ఏఐడీఎంకే, బీఎస్పీ, ఎస్పీ వంటి పార్టీలు అయితే ప్రత్యేకించి సోషల్ మీడియా ప్రచారం కోసం ఏ విధమైన ఖర్చు చేయలేదని స్పష్టం చేశాయి. ఈ వివరాలను అన్నీ సేకరించిన ఏడీఆర్ ఆయా పార్టీలు ఎన్నికల సంఘానికి ఇచ్చిన నివేదికల నుంచి సేకరించామని పేర్కొంది. మొత్తానికి తెలుగు రాష్ట్రాలలో సోషల్ మీడియాకు పెద్ద ఎత్తున ఖర్చు చేసిన పార్టీగా వైసీపీ ఉంది అన్న మాట.

# ఇరాన్ 'నృత్య' విధ్వంసం!

నెలలో జరిగిన రెండో ప్రయోగంలో ఈ క్షిపణి మంచి పనితీరును కనబర్చింది. ఆ తర్వాత నాలుగుసార్లు ఈ ప్రయోగం జరిగింది. ఆరో ప్రయోగంలో ఈ అస్త్రం 1,900 కిలోమీటర్ల దూరం ప్రయాణించి హిందు మహాసముద్రంలో పడింది. దీని వేగం ఎంత అన్నది పూర్తిగా వెల్లడికాలేదు. అయితే సెంట్రల్ ఇరాన్ నుంచి ప్రయోగిస్తే ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ నగరాన్ని ఏడు నిమిషాల్లోనే చేరుకోగలదని ఇరాన్ గతంలో పేర్కొంది.

**బహుళ వెర్షన్లు**

సెజిల్ వ్యవస్థకు సంబంధించి బహుళ వెర్షన్లు ఉండొచ్చని భావిస్తున్నారు. 2009లో చేపట్టిన ప్రయోగాన్ని సెజిల్-2 వెర్షన్‌గా ఇరాన్ అభివర్ణించింది. సెజిల్-3 వెర్షన్ అభివృద్ధి దశలో ఉండొచ్చని చెబుతున్నారు. అందులో మూడు అంచెలు ఉండొచ్చని, అది గరిష్ఠంగా 4వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించొచ్చని, ప్రయోగ సమయంలో దీని బరువు 38వేల కిలోలు ఉండొచ్చని భావిస్తున్నారు. దశాబ్దకాలం స్తబ్దుగా ఉన్న సెజిల్ ప్రాజెక్టు తిరిగి 2021లో వార్తల్లోకి వచ్చింది. నాడు సైనిక విన్యాసాల్లో దీన్ని ఇరాన్ ప్రయోగించింది. అందులో మెరుగైన గైడెన్స్ వ్యవస్థను ఉపయోగించింది. కఠిన పరిస్థితులను తట్టుకునే 'స్ట్రాప్-డౌన్' గైడెన్స్ వ్యవస్థను కూడా ఇందులో ఏర్పాటు చేశారు.

**డ్యాన్సింగ్ మిసైల్ అని ఇందుకే పేరు..:** సాధారణంగా సంప్రదాయ క్షిపణులు.. ప్రయోగానంతరం ఊహించగలిగే ప్రయాణమార్గంలో పయనిస్తాయి. సెజిల్ తీరు దీనికి భిన్నం. గగనతలంలో ఇది తన ప్రయాణమార్గాన్ని సర్దుబాటు చేసుకోగలదు. నేల నుంచి చాలా ఎత్తులో ఒడుపుగా చేసే ఈ విన్యాసాల వల్ల దీని ప్రయాణమార్గాన్ని అంచనా వేయడం కష్టం. అందుకే దీనికి డ్యాన్సింగ్ మిసైల్ అని పేరు వచ్చింది. ఈ సామర్థ్యం వల్ల ప్రత్యర్థి రాడార్ వ్యవస్థలకు చుక్కలు కనిపిస్తాయి. శత్రు క్షిపణి ఎటు పయనిస్తుందన్నది అంచనావేయడం ద్వారా గగనతల రక్షణ వ్యవస్థలు పనిచేస్తుంటాయి. నింగిలో ఒక క్షిపణిని రాడార్ గుర్తించగానే.. దాని గమనాన్ని కంప్యూటర్లు లెక్కిస్తాయి. వాటి ఆధారంగా దాన్ని ఢీ కొట్టగలిగేలా ఇంటర్‌సెప్టర్ క్షిపణికి మార్గనిర్దేశం చేస్తాయి. అయితే సెజిల్ వంటి క్షిపణులు చివరిదశలో తమ ప్రయాణ మార్గాన్ని అనూహ్యంగా మార్చేసుకుంటాయి. అలాంటి పరిస్థితుల్లో వాటిని ఢీ కొట్టడం కష్టమవుతుంది. ఇజ్రాయెల్‌కు చెందిన అధునాతన 'ఐరన్ డోమ్'ను కూడా ఈ క్షిపణి బోల్తా కొట్టించగలదని చెబుతున్నారు. దీనికితోడు సెజిల్-2పై యాంటీ రాడార్ పూత ఉన్నట్లు చెబుతున్నారు. దీనివల్ల సాధారణ గగనతల రక్షణ రాడార్లు దాన్ని లక్ష్యంగా చేసుకోవడం కష్టమన్న అభిప్రాయం ఉంది.

# డాలర్ చాప కిందికి చమురు?

వేస్తోంది.

**ట్రంప్‌పై పెరుగుతోన్న ఒత్తిడి**

తమ దేశంపై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన సంగతి తెలిసిందే. ఇరాన్ పచ్చజెండా ఊపే నౌకలకే ప్రస్తుతం హర్మూజ్ దాటడానికి అనుమతి లభిస్తోంది! రోజువారీ ప్రపంచ చమురు రవాణాలో 20శాతం ఈ జలసంధి ద్వారానే జరుగుతుంది. ఫలితంగా చాలా దేశాల్లో చమురు కొరత ప్రభావం కనిపిస్తోంది. అమెరికాపై పరోక్ష ఒత్తిడి పెరిగింది. హర్మూజ్ జలసంధిని తెరిపించటం తమ వల్ల కాకపోవటంతో నాటో దేశాలు కలసి రావాలని ట్రంప్ పిలుపునిచ్చారు. కానీ జర్మనీ, యూకేలాంటి కీలక నాటో దేశాలు అందుకు ససేమిరా అంటున్నాయి. ఇరాన్‌కు పర్షియన్ గల్ఫ్‌లో అత్యంత కీలకమైన ఖర్గ్ ద్వీపంపై బాంబులతో దాడులు చేయించడంతో ఆగకుండా సైనికులను కూడా దించి దానిని స్వాధీనం చేసుకోవాలని ట్రంప్ యోచిస్తున్నట్లు వాషింగ్టన్ నుంచే వార్తలొస్తున్నాయి. ఇరాన్ 90 శాతం ఎగుమతులకు ఖర్గ్ ద్వీపమే ముఖద్వారం. దాదాపు 3కోట్ల బ్యారెళ్ల చమురును ఇక్కడ ఆ దేశం నిల్వ ఉంచుతుంది. ఈ ద్వీపాన్ని కోల్పోతే టెహ్రాన్ ఆర్థికవ్యవస్థ చతికిలపడుతుంది.

**ఆయన మెడకే చుట్టాలని...**

అందుకే ట్రంప్ వ్యూహానికి ప్రతివ్యూహాన్ని ఇరాన్ ప్రచారంలోకి తెచ్చింది. ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్‌ను ఇరకాటంలోకి నెట్టేసేలా డాలర్ ఆధిపత్యానికే ఎసరు పెడుతోంది. 1974లో అమెరికా, సౌదీ అరేబియాల మధ్య జరిగిన ఒప్పందం తర్వాత చమురు కొనుగోళ్లకు డాలర్లలో చెల్లింపులు జరుగుతున్నాయి. నేటికీ 80 శాతం ప్రపంచ చమురు కొనుగోళ్లు డాలర్లలోనే జరుగుతున్నాయి. దీన్నే పెట్రో-డాలర్ వ్యవస్థ అంటారు. అంటే ఏ దేశమైనా ముడి చమురు కొంటే డాలర్లలో చెల్లింపులు చేస్తుంది. అలా డాలర్‌కు శాశ్వత డిమాండ్ పెరిగి... అంతర్జాతీయ మారకంగా మారటమేగాకుండా అమెరికా ఆర్థిక ఆధిపత్యానికీ బాటలు వేసింది. ఇప్పుడు డాలర్‌కు బదులు చైనా కరెన్సీ యువాన్‌లో చెల్లింపులు చేసేవారి నౌకల రాకపోకలకు హర్మూజ్ జలసంధి ద్వారా అనుమతించాలని ఇరాన్ యోచిస్తున్నట్లు అమెరికా మీడియా వెల్లడించింది. అదే జరిగితే డాలర్ చాపకిందికి చమురు వచ్చినట్లే!

**ఇప్పటికిప్పుడు ముప్పు లేకున్నా...**

ఇప్పుడు డాలర్‌ను కాదని యువాన్‌లోనో మరే కరెన్సీలోనో చెల్లింపులు పెరిగితే... డాలర్‌కు క్రమంగా డిమాండ్ తగ్గుతుంది. అలాగని అమెరికా ఆర్థిక ఆధిపత్యం రాత్రికి రాత్రి పడిపోతుందని కాదు. అదంత సులభం కూడా కాదు. ఎందుకంటే ప్రపంచ ఆర్థిక, బ్యాంకింగ్ వ్యవస్థలన్నీ డాలర్‌తో ముడి పడి ఉన్నాయి. పైగా డాలర్ కాకుండా మరో కరెన్సీలో లావాదేవీలకు చమురు ఉత్పత్తి చేసేవారు, కొనుగోలు దేశాలు, అంతా ఓ అవగాహనకు రావాల్సి ఉంటుంది. ఇప్పటికీ గల్ఫ్‌లోని ఇతర చమురు ఉత్పత్తి దేశాలు డాలర్లలోనే కొనుగోళ్లకు ఇష్టపడతాయి. కాబట్టి ఇరాన్ చర్యలు అమలు జరిగినా... అమెరికా ఆధిపత్యానికి ఇప్పటికిప్పుడు వచ్చిన ముప్పేమీ ఉండకపోవచ్చు. కానీ చమురు మార్కెట్లు, షేర్ మార్కెట్లలో, రవాణా రంగంలో ఒడుదొడుకులు పెరగొచ్చు. బంగారం, వెండి ధరలపైనా ప్రభావం ఉండొచ్చు. ద్రవ్యోల్బణం ఎక్కువకావచ్చు. ముఖ్యంగా అమెరికాలో దీని ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉంది. ఇవన్నీ ఈ నవంబరులో జరిగే అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్‌ను, రిపబ్లికన్ పార్టీని దెబ్బతీయడానికి దారితీయొచ్చు!.

# అధికారంలోకొస్తే పార్టీ కార్యకర్తలకే పెద్దపీట

జగన్ పథకాలన్నీ అమలు చేసినప్పుడు ఇప్పుడు చంద్రబాబు ఎందుకు చేయలేకపోతున్నారనే చర్చ ప్రతి ఇంట్లో జరుగుతోందన్నారు. ఈ ప్రభుత్వం రెండేళ్లు తిరక్కుండానే రూ.3.30 లక్షల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. అన్ని వనరులనూ దోచుకుంటూ రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలకూ గండి కొడుతున్నారని ఆరోపించారు. వచ్చేది వైకాపా ప్రభుత్వమే.. అప్పుడు ప్రజలకు చేసేవన్నీ పార్టీ కార్యకర్తల ద్వారానే చేస్తామని జగన్ పేర్కొన్నారు. కార్యకర్తలకు మంచి రోజులు తెస్తామన్నారు. ఒంగోలు నియోజకవర్గ వైకాపా స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలతో మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జగన్ మాట్లాడారు. 'రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు, వీళ్ల అరాచకాలు, వేధింపులు ఇంకొన్ని రోజులు మాత్రమే. రెండేళ్లు కళ్లు మూసుకుంటే తర్వాత సంవత్సరం ఎన్నికల ఏడాది. వచ్చే ఏడాదిలో నా పాదయాత్ర ప్రారంభిస్తా. తర్వాత ప్రజల్లోనే ఉంటా, అందరం కలిసికట్టుగా పనిచేద్దాం' అని జగన్ చెప్పారు.

**ఒంగోలుపై స్పష్టత..:** 'ఒంగోలు నియోజకవర్గానికి వచ్చేసరికీ మీ అందరికీ ఒక క్వశ్చన్ మార్క్ (బాలినేని శ్రీనివాసరెడ్డి తిరిగి వైకాపాలోకి వస్తారేమోననే చర్చల నేపథ్యంలో) ఉంటుంది. ప్రజలతో మమేకమవుతూ, పార్టీలో అందరినీ కలుపుకొనిపోతున్న చుండూరి రవిబాబుకు పార్టీ బాధ్యతలు అప్పగించాం' అని స్పష్టం చేశారు.

**మంచి చేయాలనే మైండ్‌సెట్ వారికి లేదు**

'రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణను గాలికొదిలేశారు. డ్రగ్స్ తీసుకుంటూ పట్టుడిన తొలి ఎంపీ పుట్టా మహేష్. మహిళలపై లైంగిక వేధింపులు, వేధింపుల వ్యవహారాల్లో ఉన్న ఎమ్మెల్యేలు అరవ శ్రీధర్, కూన రవికుమార్, నజీర్ అహ్మద్, కోనేటి ఆదిమూలంలపై చంద్రబాబు ఏ చర్యలూ తీసుకోలేదు. ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడినా, తితిదే ఛైర్మన్ నాయుడు వీడియోతో సహా దొరికిపోయినా చర్యల్లేవు. చంద్రబాబు ఉదాసీన వైఖరి వల్లే ఇలాంటివన్నీ విచ్చలవిడిగా జరుగుతున్నాయి. రాష్ట్రంలో మహిళలకు భద్రత కరవైంది. ప్రజలకు మంచి చేయాలనే మైండ్‌సెట్ కూడా ఈ ప్రభుత్వానికి లేదు' అని ఆరోపించారు.

# మళ్లీ పెట్టుబడుల జోరు పెంచుతాం..

కాలంలోనే దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి తీసుకురాగలిగామని, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రాన్ని ఎంచుకున్నాయని లోకేశ్ గుర్తుచేశారు. ఆ స్ఫూర్తితో ఇప్పుడు మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. "నూతన పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ఇప్పటికే కుదిరిన ఒప్పందాలను గ్రౌండింగ్ చేయడం మన ప్రధాన లక్ష్యం. గుర్తించిన 22 క్లస్టర్లలో అధికారులు నిపుణులుగా ఎదగాలి. ఏ ఒక్క ప్రాజెక్ట్ కూడా ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లకుండా చూడాలి" అని ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతం అయ్యాయని, ఈ నెల 23న రెండో స్టీల్ సిటీకి శంకుస్థాపన చేస్తున్నామని లోకేశ్ వెల్లడించారు. అమరావతిలో పనులు వేగంగా సాగుతున్నాయని, ఏప్రిల్ చివరి నాటికి ఉండవల్లి నుంచి సీడ్ యాక్సిస్ రోడ్డు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిషోర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# ఏపీలో గ్యాస్ కొరత లేదు, ప్రజలు ఆందోళన చెందవద్దు

సీఎం చంద్రబాబు వెల్లడించారు. మరికొన్ని టన్నుల గ్యాస్ త్వరలోనే అందుబాటులోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో ఎల్పీజీ సరఫరాకు ఇబ్బందుల్లేవని, ఆస్పత్రులు, హాస్టళ్లు, ఆలయాలకు కొరత రాకుండా చూడాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. గ్యాస్ సరఫరా అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు ఉన్నట్లు చెప్పారు. ఈ కేవైసీ, ఓటీపీల ద్వారా సిలిండర్ల డైవర్షన్ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్ లభ్యత పెరిగేలా చూడాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఉత్పత్తి పెంపు, మెరుగైన పంపిణీ జరిగేలా చూడాలని సమీక్షకు హాజరైన సీఎస్ సాయిప్రసాద్, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, గెయిల్, ఓఎన్జీసీ ప్రతినిధులకు సూచించారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాలని.. కేజీ బేసిన్ గ్యాస్‌ను పైప్డ్ నెట్‌వర్క్ ద్వారా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. సీఎన్జీ, పీఎన్జీల వినియోగం గరిష్ఠంగా పెంచాలని పేర్కొన్నారు.

# ప్రజలను పార్టీలుగా చూడొద్దు

తీవ్ర విమర్శలు చేశారు. సంక్షేమ పథకాలను కేవలం తమ పార్టీ కార్యకర్తలకే పరిమితం చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని ఆమె హితవు పలికారు. ప్రజలను ప్రజలుగా చూడాలి తప్ప, వారికి పార్టీ రంగు పులమడం తగదని అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్.. కొత్తగా ఈ పథకం పేరును 'వీబీ జి రామ్ జి'గా మార్చిన సంగతి విదితమే) పరిరక్షణ యాత్రలో భాగంగా ఆమె శ్రీకాకుళం జిల్లాలో పర్యటిస్తున్నారు. ఆముదాలవలస నియోజకవర్గం కొర్లకోట గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో పార్టీలు, కులమతాలకు అతీతంగా అందరికీ పథకాలు అందేవని గుర్తుచేశారు. కానీ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ పార్టీ కార్యకర్తలకే లబ్ధి చేకూర్చారని, ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ తెచ్చిన ఉపాధి హామీ పథకం వైఎస్సార్ హయాంలో తమ జీవితాల్లో వెలుగులు నింపిందని, కానీ కేంద్రంలో బీజేపీ వచ్చాక పథకాన్ని నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన షర్మిల, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. పని దినాలను 150 రోజులకు, రోజువారీ వేతనాన్ని రూ.400కు పెంచుతామని స్పష్టం చేశారు. నాయకులు బాగుంటేనే ప్రజలు బాగుంటారని, ప్రజల్లో మార్పు రావాలని ఆమె పిలుపునిచ్చారు.

# 'మాకు ఎవరి అవసరం లేదు'

ట్రంప్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ స్పందిస్తూ.. తమకు ఎవరి అవసరం లేదన్నారు. హర్మూజ్‌లో నౌకల రవాణాను పునరుద్ధరించేందుకు తాము ఒంటరిగానే ప్రయత్నిస్తామని చెప్పారు. "మాకు ఎవరి అవసరం లేదు. మాది ప్రపంచంలోనే అత్యంత బలమైన దేశం. అత్యంత శక్తిమంతమైన సైన్యం మాకుంది" అని అధ్యక్షుడు వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్ జలసంధిపై మిత్ర దేశాలు కలిసి రాకపోవడంపై అసహనం వ్యక్తంచేశారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడికి యుద్ధ నౌకలను పంపాలంటూ ట్రంప్ (ఇశీఖుశ్రీస ్తీబఎజూ) ఇచ్చిన పిలుపును మిత్ర దేశాలతో పాటు చైనా తోసిపుచ్చాయి. నాటో కూటమి కూడా ముందుకురాలేదు. ఈ దేశాలు నౌకలను పంపినా, పంపకపోయినా అన్ని విషయాలను గుర్తుంచుకుంటామని ట్రంప్ బెదిరింపు ధోరణిలో మాట్లాడిన సంగతి తెలిసిందే. తన చైనా పర్యటననూ వాయిదా వేసుకుంటానని హెచ్చరించారు.

# సుజనా చౌదరి కార్యాలయంలో ఎల్వోసీ పత్రాలు అంద చేత

## కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి.శ్రీధర్.

**విజయవాడ వెస్ట్, మార్చి-17,ఇన్నర్ వ్యూ ప్రతినిధి (ఎంబికె)**

విజయవాడ పశ్చిమ నియోజకవర్గం,52 వ డివిజన్ కి చెందిన, దావులూరి అప్పారావు కిడ్నీ కి సంబంధించిన వ్యాధితో బాధ పడుతున్నాడు.అతనికి సర్జరీ నిమిత్తం 3,00,000/- రూపాయల ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆయన సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ను సంప్రదించి విషయం తెలిపాడు. అదే విధంగా 54 వ డివిజన్ కు చెందిన బద్రే ఆలం రోడ్డు ప్రమాదంలో కాలికి శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు తెలిపారు. అందుకు 4,30,600/- రూపాయల వ్యయం అవుతుందని వైద్యులు తెలిపారు.ఎమ్మెల్యే సుజనా చౌదరి ఇద్దరికీ ఆర్థిక సాయం కోసం సీఎం ఆర్ ఎఫ్ కు లేఖలు రాసారు.వాటికి సంబంధించిన ఎల్వోసీ పత్రాలను బాధితుల కుటుంబ సభ్యులకు అంద చేశారు.కార్యక్రమంలో ప్రత్తిపాటి శ్రీధర్, టీడీపీ నాయకులు తారీక్ అజీజ్, బీజేపీ నాయకులు హరి ప్రసాద్, సుజనా మిత్ర లు పాల్గొన్నారు.



# స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనకై అధికారులు సమన్వయంతో కృషి చేయాలి





**అనకాపల్లి, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

స్వర్ణాంధ్రఏ2047 సాధనలో భాగంగా నిర్ణయించిన పది సూత్రాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కార్యాచరణ చేపట్టి రాష్ట్రంలో జిల్లాను అభివృద్ధి పథంలో ప్రథమ స్థానంలో నిలిచేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు.ఇటీవల ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్లో చర్చించిన అంశాలు,తీసుకున్న నిర్ణయాల అమలుపై జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మంగళవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ముందుగా తేది.5-3-2026న రాష్ట్ర ముఖ్యమంత్రితో జిల్లా అభివృద్ధి కార్యక్రమాల పై జరిగిన రివ్యూ సమావేశానికి సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించి దిశా నిర్దేశం చేసారు.అనంతరం ఈనెల 11 మరియు 12 తేదీలలో అమరావతి సచివాలయంలో రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్లో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాల అమలుపై అధికారులతో సమీక్షించారు.ప్రతి కుటుంబానికి బేసిక్ ఫ్యామిలీ ఎమెనిటీస్ అందేలా చూడడంతో పాటు కమ్యూనిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలు,పట్టణాల్లో రోడ్డు కనెక్టివిటీ పెంచడం,డ్రైనేజ్ నెట్‌వర్క్ మెరుగుపరచడం, స్ట్రీట్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ (వేస్ట్ టు వెల్త్) కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలని చెప్పారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలు,ప్రజా సేవల నాణ్యత పెంపు,ప్రభుత్వ ప్రధాన పథకాల అమలు,వాట్సాప్ గవర్నెన్స్ పై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్గదర్శి-బంగారు కుటుంబం పథకం కింద ఫ్యామిలీ కార్డు ద్వారా కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందేలా చూడాలని ఆదేశించారు.ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మరింత నాణ్యతతో అమలు చేయాలన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత పెంచాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.నైపుణ్య యాప్ వినియోగం పై యువతకు అవగాహనా శిబిరాలు ఏర్పాటు చేసి,యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేయాలన్నారు.

బాల్య వివాహాల నియంత్రణపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మండల,వార్డు, గ్రామ స్థాయిలో ఎక్కడా మంచినీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జలధార స్కీమ్ జిల్లాలో అమలు చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రిజర్వాయర్ ఫిల్లింగ్,వాటర్ హార్వెస్టింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వార్డులలో ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.స్వచ్ఛంధ సంస్థల సహకారంతో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.పి.ఎం సూర్యఘర్,పి.ఎం కుసుమ్ పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. స్వచ్చాంధ్ర కార్యక్రమంలో జిల్లాను మరింత మెరుగు పర్చాలన్నారు.ప్రతి నియోజకవర్గంలో రైతు బజారు ఏర్పాటు చేయాలని ఎడి మార్కెంటింగ్ ను కలెక్టర్ ఆదేశించారు.స్మార్ట్ కిచెన్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ పై అధికారులకు పలు సూచనలు చేసారు. ముందుగా రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న జిల్లాలలో మన జిల్లా మూడవ స్థానంలో నిలిచిందని అందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ ని జిల్లా అధికారుల సంఘం తరపున మరియు రెవెన్యూ అధికారుల సంఘం ఘనంగా సన్మానించారు. ఈ సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్,జిల్లా రెవెన్యూ అధికారి వై సత్యనారాయణ రావు, సిపిఓ రామారావు,వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## వైకాపా అనకాపల్లి జిల్లా సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శిగా నక్కా హరి కిషోర్ నియామకం





**పరవాడ, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంరెడ్డి అదీప్ రాజ్ సిఫార్సుతో నక్కా హరి కిషోర్ ను, అనకాపల్లి జిల్లా సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి గా నియమించారు.ఈ మేరకు ఆదివారం తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుండి ప్రకటన వెల్లడించారు జివియంసి 85వ వార్డు మంత్రిపాలెం జెఎన్ఆర్ఎమ్ కాలనీకి చెందిన నక్కా హరి కిషోర్‌కు ఈ కీలక బాధ్యతలను అప్పగించడం జరిగింది. పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే దిశగా సోషల్ మీడియా వేదికలను సమర్థంగా వినియోగించుకోవాలని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.ఈ సందర్భంగా నక్కా హరి కిషోర్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కు, ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ మాజీ మంత్రి గుడివాడ అమర్ నాధ్ కు,మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంరెడ్డి అదీప్ రాజ్ కు,కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, అంకిత భావంతో జగనన్న సైనికుడిగా పార్టీ బలోపేతానికి రానున్న 2029 ఎన్నికలలో మళ్లీ రెండవసారి ముఖ్యమంత్రి గా వైఎస్ జగనన్న ను గెలిచేందుకు కృషి చేస్తానని తెలిపారు ఈ సందర్భంగా పార్టీ నాయకులు,కార్యకర్తలు హరి కిషోర్‌కు అభినందనలు తెలిపారు.

## రావాడలో "రైతన్నా మీకోసం" వారోత్సవాల్లో పాల్గొన్న గండి బాబ్జి






**పరవాడ, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

పరవాడ మండలం, రావాడ గ్రామపంచాయతీలో మంగళవారం నాడు మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్నా అధ్యక్షతన పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇంచార్జ్, ఏపీ ఆయిల్ ఫీడ్ చైర్మన్ గండి బాబ్జీ ఆధ్వర్యంలో "రైతన్నా మీకోసం వారోత్సవాలు" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న గండి బాబ్జీ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ కట్టుబడి ఉంటుందని తెలిపారు. రైతుల సమస్యలను తెలుసుకోవడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పకృతి వ్యవసాయం స్టాల్ పెట్టి ఫెర్టిలైజర్స్ వాడకం తగ్గించాలని ప్రజలకు, రైతులకు తెలిపారు. వ్యవసాయపు పనిముట్లు సబ్సిడీ ద్వారా అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, వియ్యపు చిన్నా (మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు), కన్నూరు వెంకటరమణ, నకిరెడ్డి చిన్నారావు, బంధం వెంకట రమణ, లాలం ఈశ్వరరావు, సారిపల్లి జోగినాయుడు, కొత్తపల్లి అపర్ణ (మార్కెట్ కమిటీ డైరెక్టర్ ), జనపాల రాము, కోన కృష్ణ, సాలాపు రమణ , కావలి వాసు, మోటూరు సూరిబాబు, మోటూరు అప్పారావు, మరిసా అప్పలరాజు , మొల్లి గంగాధర్, చుక్కతాతారావు, మోటూరు రాము, కావలి సన్యాసిరావు, వియ్యపు అప్పలనాయుడు, మొల్లి తులసిరావు, మోటూరు సత్తిబాబు, మొల్లి బాలాజీ, వ్యవసాయ అధికారి ఎం.రమాదేవి, వ్యవసాయ అసిస్టెంట్ అనిత, క్లస్టర్ ఇన్చార్జ్‌లు, యూనిట్ ఇన్చార్జ్‌లు, బూత్ ఇన్చార్జ్‌లు, కో-కన్వీనర్లు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# క్రాంతి నగర్ గ్రామంలో భారీ చోరీ...

### నెల వ్యవధిలో రెండు చోట్ల దొంగతనాలు

### వరస దొంగతనాలు.. పోలీసు భద్రతపై ప్రజలు అసహనం





**మల్కాపురం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

జీవీఎంసీ 63వ వార్డు క్రాంతి నగర్ గ్రామంలో, మంగళవారం భారీ చోరీ జరిగింది. బాధితురాలు ముంతాజ్ తెలిపిన వివరాలు ప్రకారం. రంజాన్ పవిత్ర మాసంగా భక్తిశ్రద్ధలతో జరిగే వేడుకలో భాగంగా సోమవారం పెద్ద పండగ మహాశివరాత్రి వలె మసీదులో జాగారం చేసే ఆచారం ఉండడం వలన ముస్లిం సోదరులు అందరూ మసీదులో వేడుక (జాగారం) జరుపుతారు. అదే అదునుగా కేటుగాళ్లు మాట వేసి ఆమె మంగళవారం తెల్లవారుజామున ఒంటి గంటన్నర సమయంలో నమాజ్ నిమిత్తం పక్కనే ఉన్న మసీదుకు వెళ్లి రావడం జరిగిందని, రెండున్నర గంటల సమయంలో తిరిగి ఇంటికి వెళ్లేసరికి ఇంటిముందు తాళం వేసిన గడియ అనుమానస్పదంగా కనిపించడంతో, పక్కనే ఉన్న వారిని పిలిచి సమాచారం ఇవ్వడం జరిగిందని ఆమె అన్నారు. బీరువాలో ఉన్న పది తులాల విలువైన ఆభరణాలు, వెండి పది తులాలు, 25000 నగదు కనిపించకపోవడంతో , వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ కి సమాచారం ఇచ్చానని ఆమె వాపోయారు. ఘటనపై క్రైమ్ సిబ్బంది వెంటనే స్పందించి, సంఘటన స్థలానికి సకాలంలో చేరారని ఆమె తెలిపారు. క్లూస్ టీం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశామని క్రైమ్ ఎస్సై ఎంవి రమణ తెలిపారు. ఇదే గ్రామంలో గత నెల 24 నా తాళం వేసిన ఇంట్లో కి దొంగ చొరబడి 25000, నగదు, పసిడి చెవి దిద్దులు, 20 తులాల వెండి మరియు మరో ఇంట్లో చరవాణి దొంగలించబడిందని స్థానికులు తెలిపారు. వరస దొంగతనాలు వలన తమ ఇంట్లో ఎప్పుడూ విలువైన ఆభరణాలు చోరీకి గురవుతాయో అంటూ స్థానికులు భయపడే స్థితికి చేరుకుంది. ఏదేమైనా ఆ గ్రామంలో నెల వ్యవధిలో వరుసగా ఈ రెండు దొంగతనాలు జరగడంతో, రక్షక బటుల భద్రతపై అసహనం ఎట్టిపరుస్తున్నారు. రాత్రులు ప్రశాంతంగా పడుకోలేని పరిస్థితి ఏర్పడిందని, గతంలోనూ కూడా ఇదే ఇంటి పరిసరాలలో మొబైల్ ఫోన్లు చోరీకి గురైన ఘటన గుర్తు చేశారు. నేర ప్రవృత్తి పెంచుకున్న వ్యక్తి నిత్యం ఏదో చోట చోరీకి ప్రయత్నాలు చేస్తూనే ఉంటాడు, కానీ మన అజాగ్రత్త వాడి కి పెట్టుబడిలా తయారయింది అంటూ స్థానిక ప్రజలు సెటైర్లు వేస్తున్నారు. నిరంతరం రక్షకబటులు ఈ ప్రాంతంలోనే కాదు ఏడువార్డులోనూ, కూడా నిత్యం నిఘానేత్రంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోమని, క్రైమ్ ఎస్ఐ ఎంవి రమణ పర్యవేక్షణలో నిరంతరం ఏదోచోట ప్రజల అప్రమత్తం చేస్తూనే ఉన్నారు. నగరంలో పోలీసు వ్యవస్థ చాలా వరకు బలపడింది, కానీ వరుస దొంగతనాలు ఏదో ఒకచోట జరుగుతూ పోలీసులుకు సవాలగా మారారు కేటుగాళు .. పోలీసులు అప్రమత్తం చేసే విధంగా ప్రతి ఒక్కరు తమ ఆస్తులను సంరక్షించుకునేందుకైనా ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా ఉండేందుకు ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేసుకుంటే, దొంగతనాలు జరిగేటప్పుడు, వాటి ద్వారా సమస్యలు పరిష్కారం ఈజీ అవుతాయని, పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గ్రామంలో వరస దొంగతనాలు పై కాస్త భద్రత పెంచమని స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు,రక్షక బటులను కోరుతున్నారు.

# ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలి

### -కోగంటి.బాబు.ఎ.యం.సి.చైర్మన్

**కంచికచర్ల, మార్చి 17,**
**ఇన్నర్ వ్యూ ప్రతినిధి (ఎంబికె):**



నందమూరి తారక రామారావు కు ప్రజా జీవితంలో చేసిన సేవలకు భారతరత్న పురస్కారం సముచితస్థానమని, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ల సంఘం ఉపాధ్యక్షుడు కోగంటి. బాబు అన్నారు.ఎన్టీఆర్ మాలధారణతో నిమ్మకూరు నుండి బయలుదేరి ఉమ్మడి కృష్ణ జిల్లాలో 41రోజులు పాదయాత్ర చేస్తున్న సత్యసాయి జిల్లా ధర్మవరం గ్రామానికి చెందిన బి.ఎల్ నరసింహం మంగళవారం సాయంత్రానికి కంచికచర్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్న నరసింహ కు మండల తెలుగుదేశం పార్టీ నాయకుడు కోగంటి బాబు తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ముందుగా ఎన్టీఆర్ అభిమాని అయిన బిఎల్ నరసింహాని అభినందించిన అనంతరం కోగంటి మాట్లాడుతూ తెలుగువారి ఆరాధ్య దైవంగా తెలుగుజాతి కీర్తిని దశ దిశలుగా చాటిన వ్యక్తిగా, రాజకీయాలలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహనీయులుగా,ప్రజా జీవితంలో చేసిన సేవలకు గుర్తింపుగా భారత తన పరిష్కారం నందమూరి తారక రామారావుకు సముచితస్థానమని, నందమూరి తారక రామారావుకు భారతరత్న అవార్డు ఇవ్వాలని కోగంటి బాబు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బర్రె వాసు,మేడిద శ్రీను, గుత్తా ఓంకార్,వల్లెపు శీను,మురుమూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కేజీహెచ్‌పిల్లల వైద్య విభాగం లో'ప్రాజెక్ట్ ఆయుష్మాన్' కింద నర్సింగ్ యూనిట్ ప్రారంభం



**విశాఖపట్నం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

నోయిడా లేడీస్ సర్కిల్ 210 ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సేవా కార్యక్రమమైన 'ప్రాజెక్ట్ ఆయుష్మాన్' కింద కింగ్ జార్జ్ హాస్పిటల్, పిల్లల వైద్య విభాగం లో విశాఖపట్నంలో నూతన నర్సింగ్ యూనిట్‌ను ఈరోజు ప్రారంభించారు. ఈ నర్సింగ్ యూనిట్‌ను లేడీస్ సర్కిల్ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ థీమ్ ప్రాజెక్ట్ కన్వీనర్ మరియు ఏరియా 9 ఏరియా సెక్రటరీ-ట్రెజరర్ క్ర్. అభిజ్ఞ గ్రాంధి గారు అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. ఐ. వాణి, ఆంధ్ర మెడికల్ కాలేజ్ పీడియాట్రిక్స్ విభాగాధిపతి డా. బి.ఎస్. చక్రవర్తి, చైర్‌పర్సన్ డా. ధన్య అన్నా కురియన్, సర్కిలర్స్ శు భాంగిని రోహత్‌గి, అంకిత సైనీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. ఐ. వాణి మాట్లాడుతూ, ఈ నర్సింగ్ యూనిట్ ద్వారా ఆసుపత్రిలో మాతా-శిశు సంరక్షణ సేవలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. అలాగే, పీడియాట్రిక్స్ మరియు ఓబీజీ విభాగాల ఓపీలు, వార్డుల్లో ఇలాంటి మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేయాలని నోయిడా లేడీస్ సర్కిల్‌ను కోరుతూ, వారి సేవా భావాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా లేడీస్ సర్కిల్ 210 తమ సమాజ సేవా నిబద్ధతను మరోసారి చాటిచెప్పుతూ, ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా. పద్మావతి,(అసిస్టెంట్ ప్రొఫెసర్) డా. సత్యవాణి (అసోసియేట్ ప్రొఫెసర్), డా. తాతం నాయుడు (అసిస్టెంట్ ప్రొఫెసర్) తో పాటు పీడియాట్రిక్స్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖకు సెమీ రింగ్ రోడ్ !

**విశాఖపట్నం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

విశాఖ అంతర్జాతీయ నగరంగా ఎదిగేందుకు ఏపీ ప్రభుత్వం మరో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నుండి రాంబిల్లి నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేషనల్ బేస్ -- చీపూరుపల్లి వరకు సుమారు 70 కిలోమీటర్ల మేర సెమీ రింగ్ రోడ్డు నిర్మించాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రహదారి భోగాపురం, ఆనందపురం, పెందుర్తి, సబ్బవరం గుండా రాంబిల్లిని కలుపుతుంది. విశాఖ మహానగర రద్దీని తగ్గించడంతో పాటు, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది ఒక మలుపుగా మారుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రాజెక్టు కేవలం రవాణా సౌకర్యానికే పరిమితం కాకుండా, విశాఖ చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీగా రియల్ ఎస్టేట్ పారిశ్రామికాభివృద్ధికి బాటలు వేయనుంది. భోగాపురం విమానాశ్రయం నుండి రాంబిల్లిలోని రక్షణ, పారిశ్రామిక కేంద్రాలకు వేగవంతమైన కనెక్టివిటీ లభించడం వల్ల లాజిస్టిక్స్ రంగం పుంజుకుంటుంది. ఐటీ సెంటర్లు, ఫార్మా సిటీ , పోర్ట్ ఆధారిత పరిశ్రమలకు ఈ సెమీ రింగ్ రోడ్డు వెన్నెముకగా నిలవనుంది. దీనివల్ల విశాఖ నగరం లోపలికి భారీ వాహనాల రాక తగ్గి, ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

## బీచ్ రోడ్డుపై కలకలం... సముద్ర తీరంలో గుర్తుతెలియని మృతదేహం!



**విశాఖపట్నం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

విశాఖ బీచ్ రోడ్డులో మరోసారి కలకలం రేగింది. పార్క్ హోటల్ సమీపంలోని అన్మోల్ విల్లా వద్ద సముద్రం ఒడ్డున గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనపడటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. సుమారు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల ఈ వ్యక్తి ఎవరో తెలియకపోవడం మిస్టరీగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టారు. మృతుడు మెరిన్ కలర్ షర్ట్, బ్లూ కలర్ ఫ్యాంట్ ధరించి ఉండగా, సర్ఫ్ కలర్ చెక్స్ ఉన్న బ్లూ ఆఫ్ ఫ్యాంట్ మరియు వైట్ కట్ బనియన్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. అతనికి రెండు పేటలు మొలతాడు ఉండగా, మెడలో సిల్వర్ తాయిత్తుతో ఉన్న నల్ల త్రాడు ఉంది. జుట్టు తెలుపు-నలుపు మిశ్రమంగా ఉండి, కుడిచేయి రిస్ట్ పై త్రిశూలం పచ్చబొట్టు ప్రత్యేక గుర్తుగా పోలీసులు పేర్కొన్నారు. ఈ వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిసిన పక్షంలో వెంటనే త్రీటౌన్ సీఐ (ఫోన్: 9440796011) లేదా త్రీటౌన్ పోలీస్ స్టేషన్ (ఫోన్: 0891-2755517)ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## పాల కల్తీపై ప్రత్యేక తనిఖీలు

### - లైసెన్స్ తప్పనిసరి

**విశాఖపట్నం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

రాజమండ్రిలో ఇటీవల వెలుగుచూసిన పాల కల్తీ వ్యవహారం నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సంబంధిత శాఖ అధికారులు విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలను పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ డి శంకరరావు, ఉప సంచాలకులు డాక్టర్ ఎం చంద్రశేఖర్ పర్యవేక్షించారు. ఇందులో భాగంగా ఆనందపురం మండలం వేములవలస జంక్షన్లో గల బాలాజీ స్వీట్స్ అండ్ బేకరీ లో తనిఖీలు చేపట్టారు. అలాగే పాలను శుద్ధి చేసి విక్రయిస్తున్న దుకాణాలు, పాలతో కూడినపదార్థాలు తయారు చేసే కేంద్రాలను సందర్శించి వారి వివరాలను నమోదు చేశారు. పాల నాణ్యత, నిల్వ విధానం, పరిశుభ్రత ప్రమాణాలు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సంయుక్త సంచాలకులు డాక్టర్ డి శంకరరావు, ఉప సంచాలకులు డాక్టర్ ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ పాలు మరియు పాల పదార్థాలను తయారు చేసి విక్రయిస్తున్న వారందరూ తప్పనిసరిగా ఆహార భద్రత లైసెన్స్ పొందాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రజలకు స్వచ్ఛమైన, నాణ్యమైన పాలు అందించడం ప్రతి వ్యాపారి బాధ్యతగా పేర్కొన్నారు.పాలలో కల్తీకి పాల్పడే వారిపై నిరంతర తనిఖీలు కొనసాగిస్తామని, తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## తిరుపతిలో మహిళలపై అక్రమ అరెస్టులపై నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు





**పరవాడ, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

తిరుపతిలో మహిళలపై కేసులు, అరెస్టులు, పీడీ యాక్ట్‌కు వ్యతిరేకంగా నిరసన తిరుపతిలో టి.టి.డి.చైర్మన్ బీఆర్ నాయుడుపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలపై టిడిపి వర్గం ప్రేరేపణతో కేసులు నమోదు చేసి, అరెస్టులు చేయడం, అలాగే పీడీ యాక్ట్ విధించే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ పేర్కొన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తపరచే హక్కు ఉందని, ముఖ్యంగా మహిళలు తమ గౌరవం, భద్రత కోసం చేపట్టిన నిరసనలను అణచివేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. మహిళలపై అక్రమ కేసులు మోపడం, అరెస్టులు చేయడం, పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాలను ఉపయోగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. అందువల్ల ఈ చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన మహిళలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బొడ్డేడ ప్రసాద్ అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, జడ్పిటిసిలు, సర్పంచులు,ఎంపీటీసీలు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు అరుదైన రికార్డ్





**విశాఖపట్నం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

ఆనందపురం మండలం గంభీరం వద్దగల అక్షయ పాత్ర ఫౌండేషన్ తన 25 సంవత్సరాల సేవా ప్రయాణంలో భాగంగా 5 బిలియన్ భోజనాల పంపిణీ అనే గొప్ప మైలురాయిని చేరుకుంది. ఈ సందర్భంగా న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో ఘన కార్యక్రమం నిర్వహించగా, భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అక్షయ పాత్ర విశాఖపట్నం జోన్ అధ్యక్షుడు డాక్టర్ నిష్కించిన భక్త దాసు స్వయంగా పాల్గొన్నారు. ఆయన పరిధిలోని ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల్లో ఫౌండేషన్ సేవలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. విశాఖపట్నంలో 2008లో కేవలం 7 పాఠశాలలతో ప్రారంభమైన అక్షయ పాత్ర సేవలు నేడు రెండు ఆధునిక వంటశాలల ద్వారా 331 పాఠశాలలకు చెందిన సుమారు 47 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ పోషకాహారం అందించే స్థాయికి ఎదిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా అక్షయ పాత్ర ఫౌండేషన్ 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో 78 కేంద్రాల ద్వారా రోజుకు 2.35 మిలియన్ల మంది విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం అందిస్తోంది. 2030 నాటికి రోజుకు 3 మిలియన్ల మందికి భోజనం అందించాలనే లక్ష్యంతో సేవలను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ, 25 సంవత్సరాలుగా ఒక్కరోజు కూడా విరామం లేకుండా భోజనం అందించడం గొప్ప విషయం అని ప్రశంసించారు. పిల్లల ఆకలి నివారణతో పాటు వారి విద్యాభివృద్ధికి అక్షయ పాత్రోస్తున్న సేవలు దేశ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయని తెలిపారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ, అక్షయ పాత్ర కార్యక్రమం నేడు జాతీయ స్థాయిలో ప్రజా ఉద్యమంగా మారిందని, లక్షలాది మంది పిల్లలకు పౌష్టికాహారం అందించడం ద్వారా విద్యా రంగానికి మేలుచేస్తోందని పేర్కొన్నారు.

భారత ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం పోషణ పథకంలో కీలక భాగస్వామిగా అక్షయ పాత్ర ఫౌండేషన్ నిలిచి, నాణ్యత, పరిశుభ్రత, సాంకేతికతతో కూడిన సేవల ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఆకలితో ఏ ఒక్క బాలుడు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ సంస్థ, ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నడిచే పాఠశాల మధ్యాహ్న భోజన కార్యక్రమంగా ఎదిగి సమాజ సేవలో విశిష్ట స్థానం సంపాదించింది.

## సీఐ దివాకర్ యాదవ్ సేవా చైతన్యం

### - సీపీ ఆదేశాలతో మహారాణిపేట స్టేషన్‌లో వీల్‌చైర్ ఏర్పాటు




**విశాఖపట్నం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు ప్రజా సేవలో మరో ముందడుగు వేసిన మహారాణిపేట పోలీసులు, మానవతా దృక్పథాన్ని మరోసారి చాటుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రత్యేకంగా వీల్ చైర్ ఏర్పాటు చేసి సేవా స్ఫూర్తిని చూపించారు. ప్రజల పట్ల బాధ్యత, సహానుభూతి కలగలిపిన ఈ చర్యకు స్థానికుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా మహారాణిపేట పోలీస్ స్టేషన్‌లో సీఐ దివాకర్ యాదవ్ స్వయంగా ముందుండి దివ్యాంగులు మరియు వృద్ధుల సౌకర్యార్థం వీల్ చైర్ ఏర్పాటు చేయించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ చర్యతో మహారాణిపేట పోలీసులు కేవలం చట్ట అమలు మాత్రమే కాకుండా, సమాజానికి సేవ చేసే దిశగా కూడా తమ కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తిస్తున్నారని స్థానికులు అభినందిస్తున్నారు.

## ఘనంగా గంటా దంపతుల వివాహ వార్షికోత్సవం

### - హాజరైన మాజీ ఎమ్మెల్యే అవంతి దంపతులు




**విశాఖపట్నం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

భీమిలి నియోజకవర్గం ఎంఎల్ఏ (మాజీ మంత్రి) గంటా శ్రీనివాసరావు,శారదమ్మల 40వ వివాహ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. తగరపువలసకు సమీపంలో గల సవరవల్లిలోని సన్ రై రిసార్ట్స్‌లో జరిగిన ఈ వేడుకకు మాజీ మంత్రి,అవంతి శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా గంటా దంపతులకు అవంతి శ్రీనివాస్ ఆత్మీయంగా వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో తోడుగా నిలిచిన గంటా దంపతులు ఇలాగే మరిన్ని వసంతాలు సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అవంతి విద్యా సంస్థల వైస్ చైర్మన్ ముత్తంశెట్టి జ్ఞానేశ్వరి, జీవీఎంసీ 6వ వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## సమ్మెద గిరిజన గ్రామంలో శ్రీ శ్రీ పోతురాజు తండ్రి దేవుని దర్శించుకున్న మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కర్ రావు



**దేవరపల్లి, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

అనకాపల్లి జిల్లా దేవరపల్లి మండలం చింతలపూడి గిరిజన పంచాయతీలో సమ్మెద గ్రామంలో శ్రీశ్రీశ్రీ పోతురాజుతండ్రి పండగ మహోత్సవం కార్యక్రమంలో దేవరపల్లి మండల మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు టిడిపి దేవరపల్లి మండల అధ్యక్షులు వెంకటరమణ కోఆపరేట్ ప్రెసిడెంట్ సత్తిబాబు అశోక్ మాజీ సర్పంచ్ మాడుగుల నియోజవర్గ తెలుగు ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగేశ్వరరావు కడిమి నాగేశ్వరరావు శ్రీ పోతురాజుదేవుడు దర్శించుకోవడం జరిగింది అనంతరం గ్రామంలో కోలాటం పదర్శన పాల్గొని చింతలపూడి పంచాయతీ టిడిపి గ్రామ కమిటీ నాయకులు గ్రామ శాఖ అధ్యక్షులు ఉపాధ్యక్షులు సాహు జగన్నాథం దాసురమణ చింతలపూడి సెటిల్మెంట్ తామరబ్బ బూతు కన్వీనర్ శెట్టి అప్పలకొండ దేవరపల్లి మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు మొసలి పైడిరాజు కార్యదర్శి దొమ్మంగి చంద్రమౌళి కొరతం లక్ష్మణ సాహు శ్రీనివాసరావు గుంట శంకరయ్య దాయరి శ్రీను జంపా కృష్ణ తామల బుచ్చిబాబు టోకూరు అప్పలరాజు గెమ్మల లక్ష్మణరావు కొమ్ము శివాజీ కతరాజ కృష్ణ ఆఖరి బంగారు బాబు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పర్యవేక్షించిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

### - సి ఎస్ ఆర్ నిధులతో పెందుర్తి హై స్కూల్‌కు మౌలిక వసతులు కల్పన...









**పెందుర్తి, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

పెందుర్తి నియోజకవర్గం పెందుర్తి మండలం జీవీఎంసీ 96 వార్డు లో పెందుర్తి పీఎం శ్రీ గవర్నమెంట్ హై స్కూల్ ను సందర్శించి మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరును పరిశీలించిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు నియోజకవర్గం పరిధిలోని కంపెనీల నుండి సి ఎస్ ఆర్ నిధులు సేకరించి పెందుర్తి పీఎం శ్రీ గవర్నమెంట్ హై స్కూల్ లో మౌలిక వసతులు కల్పిస్తామని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలన నిమిత్తం పెందుర్తి హై స్కూల్ సందర్శించి పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో కలిసి భోజనం చేసి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుని,పిల్లలకు సరైన పోషణ ఆహారం అందుతుందా లేదా అని తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో జరుగుతున్న విద్యాబోధనను పరిశీలించారు. పాఠశాల ఆవరణ అంతా కలియతిరిగి మౌలిక వసతులను తనిఖీ చేశారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు కష్టపడి నాణ్యమైన విద్యా బోధన చేస్తున్నారని, అత్యుత్తమ ఫలితాలు రాబట్టారని కొనియాడారు. అలాగే రుచికరమైన భోజనం అందిస్తున్నారని తెలిపారు. అయితే పెందుర్తి హై స్కూల్ 13 ఎకరాలు విస్తీర్ణం లో ఉండగా ప్రస్తుతం ఏడెకరాల మాత్రమే వినియోగం ఉందని మిగిలిన భూమిని కూడా స్వాధీనం చేసుకుని ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు తెలిపారు. నిధులు మంజూరుకు మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని వెల్లడించారు. పాఠశాలలో మరుగుదొడ్లు సరిగా లేకపోవడం, కొన్నిచోట్ల ఫ్యాన్లు కూడా పనిచేయక పోవడానికి గుర్తించినట్లు తెలియజేశారు. ఈ పనులు కోసం పలు కంపెనీల నుండి సి ఎస్ ఆర్ నిధులు సేకరించి అతి త్వరలో పూర్తి చేసే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే రమేష్ బాబు హామీ ఇచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ మధు మూర్తి, స్వర్ణ, హై స్కూల్ హెడ్ మాస్టర్ చిన్మయి, హై స్కూల్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు,పెందుర్తి బీజేపీ పార్టీ ఇంచార్జ్ గొర్లి రాము నాయుడు, పెందుర్తి మండలం ఎంపీపీ గ్రనెడ్డి మాలతి నగేష్, పెందుర్తి మండల పార్టీ అధ్యక్షులు కొరుపోలు రామానాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్, స్కూల్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వెల్లంకిలో 'రైతన్న మీకోసం'



**విశాఖపట్నం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "రైతన్న మీకోసం" కార్యక్రమం వేములవలస రైతు సేవా కేంద్రం పరిధిలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సంయుక్త సంచాలకులు డాక్టర్ డి శంకరరావు, ఉప సంచాలకులు డాక్టర్ ఎం చంద్రశేఖర్ పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. వెల్లంకి గ్రామంలో స్థానిక సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి పశువుల సంరక్షణ, వ్యాధి నివారణ చర్యలు, గాలికుంటు వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పశువులకు సమయానికి టీకాలు వేయించుకోవడం ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చని తెలిపారు. అలాగే పశువుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ అవసరమని, ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాస్ పట్నాయక్‌తో మర్యాదపూర్వక కలయిక



**విశాఖపట్నం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

విశాఖ జిల్లా శిష్టకరణ విభాగం అధ్యక్షుడిగా మానాపురం శ్రీనివాస్ పట్నాయక్ నియమితులైన సందర్భంగా పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా 86వ వార్డు అధ్యక్షులు చేగొండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు ఫ్లవర్ బొకేతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. సీనియర్ నాయకులు వెలుగుల పరుశురాముడు, వాడపల్లి రామచంద్ర రాజు, వార్డు ఉపాధ్యక్షులు భూపతి రాజు శ్రీనివాసరాజు, చిట్టి బాలకృష్ణ, దువ్వాడ కాలనీ సీనియర్ నాయకులు గౌరీ శంకర్, ఆనంద్, హరిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మానాపురం శ్రీనివాస్ పట్నాయక్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో శిష్టకరణ విభాగం మరింత అభివృద్ధి సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# 13వ వార్డు శివాజీ నగర్‌లో అభివృద్ధి పరుగులు

**- ఎంఎల్‌ఏ వెలగపూడి రామకృష్ణబాబు చొరవతో పనులకు వేగవంతం - మారుతున్న వార్డు రూపురేఖలు**

**ఆరిలోవ, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

జీవీఎంసీ 13వ వార్డు పరిధిలోని శివాజీ నగర్‌లో అభివృద్ధి పనులు స్పష్టంగా కనిపిస్తుండగా ప్రజల్లో కొత్త ఆశలు రేకెత్తుతున్నాయి. తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు చొరవతో పనులు వేగం అందుకోవడం, స్థానిక స్థాయిలో కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ జరగడం వల్ల వార్డు రూపురేఖలు మారుతున్నాయన్న భావన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, స్థానిక నాయకులతో కలిసి పనులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు చొరవ, సహకారంతో వార్డులో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. శివాజీ నగర్, శ్రీకాంత్ నగర్ ప్రాంతాల్లో ప్రధాన గేడ్డ పనులు జోరుగా సాగుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ, దారపాలెం, శ్రీకాంత్ నగర్ ప్రాంతాల్లో సిసి రోడ్లు, తారు రోడ్లు, కాలువల నిర్మాణ పనులు టెండర్ దశలో ఉన్నాయని, త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఇంకా స్కిల్ డెవలప్మెంట్ జంక్షన్ నుండి ఆరిలోవ కాలనీ చివరి బస్టాప్ వరకు డివైడర్ మధ్యలో 27 సెంటర్ ఫోల్ వీధిలైట్లు ఏర్పాటు చేసే పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్న తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబుకి, విశాఖ నగర మేయర్ పీల శ్రీనివాసరావుకి, జీవీఎంసీ కమిషనర్ కేతన్గర్గ్ కి, సంబంధిత అధికారులకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి పనులతో 13వ వార్డు కొత్త రూపు సంతరించుకుంటుండగా, ప్రజల్లో ఆశలు మరింత పెరుగుతున్నాయి. స్థానిక నాయకత్వం, ఎంఎల్ఏ చొరవ కలిసివస్తే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందో ఈ వార్డు ఉదాహరణగా నిలుస్తోందని స్థానికుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



# నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరకు భక్తుల సౌకర్యార్థం పటిష్ట బందోబస్తుకు ముందస్తు జాగ్రత్తలు







**అనకాపల్లి, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన అనకాపల్లి నూకాంబిక అమ్మవారి 'కొత్త అమావాస్య జాతర నెల రోజుల పాటు జరగనున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అత్యంత పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐ.పి.ఎస్. తెలిపారు. మంగళవారం ఆయన ఆలయ పరిసరాలను సందర్శించి, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో సమీక్షించారు.ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఎండలు ఎక్కువగా ఉన్నాయి.భక్తులు క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చినప్పుడు వడదెబ్బకు గురికాకుండా నీడ (షెడ్లు),చల్లని మంచినీరు, మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బందోబస్తులో ఉన్న పోలీసులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి.రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు తోపులాటలు జరగకుండా చూడాలి.ముఖ్యంగా మహిళలు, చిన్న పిల్లలు మరియు వృద్ధుల పట్ల సున్నితంగా వ్యవహరిస్తూ వారికి తగిన సహకారం అందించాలి.జాతర నెల రోజుల పాటు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను మళ్లించడం జరిగింది.పార్కింగ్ స్థలాల వద్ద సిబ్బంది నిరంతరం నిఘా ఉంచాలి.జనసందోహంలో దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటివి జరగకుండా సాదా సీదా దుస్తుల్లో నిఘా బృందాలను ఏర్పాటు చేశారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. భారీ విద్యుత్ దీపాలంకరణ మరియు స్టేజ్ ప్రోగ్రాముల వద్ద ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా అగ్నిమాపక యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. "వేలాదిగా తరలివచ్చే భక్తులు పోలీసు వారికి సహకరించాలి.ఎండ తీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే దగ్గరలోని పోలీసు సిబ్బందిని సంప్రదించాలి." ఈ సమీక్షలో సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి, ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను, ఇన్స్పెక్టర్లు ప్రేమ్ కుమార్, వెంకట నారాయణ, ఎస్సై సంతోష్ కుమార్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసం

## జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్






**అనకాపల్లి, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

సర్వ మానవాళి సుఖ సంతోషాలు రంజాన్ ప్రార్థనల ముఖ్య ఉద్దేశం అని జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యనిర్వహణ అధికారి ఎం.సత్య పద్మ ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణం స్థానిక వేగి వీధి కర్రీ రమేశ్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం సాయంత్రం జరిగిన 'ఇఫ్తార్ విందు' కార్యక్రమంలో ఎమ్మెల్యే లు కొనతాల రామ క్రిష్ణ, బండారు సత్యన్నారాయణ మూర్తి తో కలిసి జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసమని, రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ఓర్పు, సహనం ప్రతీ ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలన్నది రంజాన్ ఉపవాస దీక్షల ప్రధాన సందేశమన్నారు. మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నాదని, వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్ష చేసిన చిన్నారులతో,ముస్లిం మత పెద్దలతో అనకాపల్లి, వి మాడుగుల శాసనసభ్యులు కొణతల రామకృష్ణ, బండారు సత్యన్నారాయణ మూర్తి లు 'ఇఫ్తార్' విందులో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా ముస్లిం సోదరులు ఇఫ్తార్ ఉపవాస దీక్ష విరమించి, నమాజు ప్రార్థనలు చేశారు. అలాగే ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక దువా ప్రార్థనలు నిర్వహించారు. అనకాపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు కొణతల రామకృష్ణ మాట్లాడుతూ ముందుగా ముస్లిం సోదరలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ రంజాన్ మాసంలో చేసే ఉపవాస దీక్ష ద్వారా మానసిక, శారీరక పవిత్రత చేకూరుతుందన్నారు. మైనార్టీల సంక్షేమంతో పాటు వారి అభివృద్దే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రస్తుతం మసీదుల మరమ్మతులకు మరియు షాదీ ఖానా నిర్మాణం, బరియల్ గ్రౌండ్ ప్రహరీ గోడ నిర్మాణాలు కోసం నిధులు మంజూరు చేయటానికి కృషి చేస్తానని తెలిపారు. వి.మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యన్నారాయణ మూర్తి మాట్లాడుతూ 30 రోజులపాటు ఎంతో నిష్టగా ఉంటూ కఠోర దీక్షలను పాటిస్తూ పవిత్ర ఖురాన్ మహమ్మద్ ప్రవక్త ఆదేశాలను అమలు చేసి దైవభీతితో నెల రోజులు పాటు గడపడం ఎంతో స్ఫూర్తిదాయక మన్నారు. ఈ రంజాన్ మాసంలో హిందూ ముస్లిం భాయి భాయి అనే వాతావరణం లో అందరిని ఎంతో ఆత్మీయ కలయికగా ఇలాంటి ఇఫ్తార్ వేడుకలలో కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రంజాన్ మాసాన్ని కేవలం ముస్లింలే కాదు అందరూ గౌరవిస్తారని సోదర భావంతో మెలిగే ఈ పవిత్ర రంజాన్ కార్యక్రమంలో తాను పాల్గొనడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు.వి. మాడుగుల నియోజకవర్గంలోని షాదీ ఖానా, బరియల్ గ్రౌండ్, పప్రహరీ గోడ నిర్మాణాల కోసం మరియు ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర, గృహ నిర్మాణం కార్పొరేషన్ చైర్మన్లు మళ్ల సురేంద్ర,బత్తుల తాతీయ్య బాబు,జామా మషీద్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పి ఎస్ ఎన్ హుస్సేన్,కార్యదర్శి ఎం.డి.జిలాని,ముస్లిం మతపెద్దలు,ప్రభృతులు, తదితరులు పాల్గొన్నారు.

## వెల్లంకి నేషనల్ హైవే అండర్ పాత్ పనులు పూర్తి

# గంటా చొరవతో తీరిన దశాబ్దాల కష్టం



**ఆనందపురం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

భీమిలి నియోజకవర్గం, ఆనందపురం మండలం వెల్లంకి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఎదురవుతున్న ప్రమాదాలకు ఎట్టకేలకు చెక్ పడింది. స్థానిక ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న అండర్ పాత్ పనులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో వేగవంతమై, విజయవంతంగా పూర్తయ్యాయి. గంటా శ్రీనివాస రావు ఆదేశాల మేరకు గత నెలలో తెలుగుదేశం పార్టీ నియోజవకర్గం నాయకులు చిక్కాల విజయబాబు సమక్షం లో పరిశీలించగా సమస్య పరిష్కారం చేయాలని స్థానిక నాయకులకు, అధికారులకు సూచించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ అండర్ పాత్ పనులు అసంపూర్తిగా ఉండటం వల్ల వెల్లంకి గ్రామ ప్రజలు హైవే దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ప్రజల భద్రత దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వారి పర్యవేక్షణలో పనులు పూర్తయి, నేడు ఈ అండర్ పాత్ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఇది హైవే రోడ్డు దాటాలి అంటే చాలా ప్రమాదాలు చోటు చేసుకొనే అవకాశం ఉండేది ,ఉగాది సందర్భముగా సాధు మఠం మరియు శ్రీ పైడితలమ్మ తీర్థం పండుగ ఉండడం వలన కొన్ని వేల మంది ప్రజలకు ఇబ్బంది లేకుండా ఈ అండర్ పాత్ పనులు పూర్తి చేశారు.అలానే గ్రామానికి సంబంధం ఉన్న స్మశానం మరియు రైతుల భూములు వెళ్ళడానికి మరియు తగరపువలస వైపు వెళ్ళాలన్న ఈ అండర్ పాత్ చాలా ఉపయోగపడుతుంది. ఈ సందర్భంగా ఆనందపురం మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కాకర వెంకట రమణ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా గంటా శ్రీనివాస్ రావు మరియు విజయ బాబు తీసుకున్న నిర్ణయం వల్ల నేడు వెల్లంకి గ్రామస్తులకు పెద్ద ఊరట లభించింది. హైవే దాటే క్రమంలో జరిగే ప్రమాదాలకు ఈ అండర్ పాత్ ద్వారా శాశ్వత పరిష్కారం లభించిందిఅని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్లంకి గ్రామ సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణ రావు తాటిచెట్టి శ్రీను, తాటిశెట్టి చిన్నారావు ,సామాజికవేత్త కాకర సురేష్ కుమార్, స్థానిక టిడిపి నాయకులు మరియు గ్రామ పెద్దలు,ప్రజలు పాల్గొన్నారు.

# ప్రచారం పిచ్చి పీక్‌లో ఉందే!

**- సుపోషిత్ అవార్డ్ ఎంపికకు కృషి చేసిన గ్రామ అంగన్వాడీలకు శుభాభినందనలు...**

**పరవాడ, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

ఈ ఘనతను తన ఖాతాలో వేసుకునేందుకు నిరంతరం ప్రచారం పిచ్చి పీక్‌లో ఉండే సర్పంచ్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నాం. నలబై ఏళ్లలో ఎన్నడూ లేని ఖ్యాతి తెచ్చినట్టు బిల్డప్. పథకం ప్రారంభమై ఏడాది అయితే నలబై ఏళ్ల నీ గొప్పేంటో చెప్పాలి. దార్శినికత, సాంకేతిక పరిజ్ఞానం అంటూ డబ్బా కొట్టే అబద్దాల శిల్పాలు చెక్కేసి, టచ్‌ఫోన్‌లో పెట్టేసే టెక్నాలజీ అంటూ ప్రచారమా!. నీ టెక్నాలజీ ఏపాటిదో కళ్యాణ మండపం నిధులు కాజేయ్యడంలో చూపిన తీరు మండల ప్రజలకి తెలిసిందే!. చెక్ పవర్ రద్దయితే హైకోర్టుకు కెళ్లడంలో నీ దార్శినికత కన్పించింది. ఆరిపోయే దీపానికి అమాత్రం దార్శినికత ఉండాలి మరి. సుపోషిత అవార్డ్ పోషకాహార లోపాన్ని నిర్మూలించి, మంచి పోషకాహార పంపిణీని పటిష్టం చేసేందుకు ఉద్దేశించిందన్న కనీసం ఇంగితం లేని ప్రెస్‌నోట్‌కు భజాభజంత్రీలు వాయిస్తున్న భజనబ ందానికి తెలియజేసేందుకు స్కీం వివరాలు. సుపోషిత్ గ్రామపంచాయతీ అభియాన్‌ను గౌరవ ప్రధానమంత్రి మాన్యశ్రీ నరేంద్రమోడీ డిసెంబర్ 26, 2024లో ప్రారంభించారు. ఈ కర్యాక్రమం ద్వారా పోషణ ఆహార లోపాన్ని నిర్మూలించి పోషకాహార పంపినీ సేవలను పటిష్టం చేయడం ద్వారా సుపోషిత భారత్‌ను నిర్మించడం. ఇందుకోసం 10కోట్ల రూపాయలు కేటాయించి వీటితో దేశవ్యాప్తంగా 1000గ్రామపంచాయతీలు, 3మూడు జిల్లాలను ఎంపిక చేసి ఒక్కో పంచాయతీకి లక్ష రూపాయలు మౌలికసదుపాయాలు కల్పన, పోషకాహారం ద్వారా సత్ఫలితాలు సాధనకు వినియోగిస్తారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆప్ వుమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్, మిషన్ సాక్ష్యం అంగన్వాడీ, పోషణ 2.0ద్వారా అన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తారు. సుపోషిత్ గ్రామపంచాయతీ అభియాన్ అవార్డ్‌కు డిసెంబర్ 26, 2024-జనవరి 31, 2026 మధ్యకాలాన్ని పెరామీటర్‌గా తీసుకొని ఎంపిక చేస్తారు.

# 63వ వార్డులో జోనల్ కమిషనర్ హేమావతి సుడిగాలి పర్యటన

**మల్కాపురం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

జీవీఎంసీ 63 వ వార్డు కొండ ప్రాంతంలో, జరుగుతున్న అభివృద్ధి పనులను జోనల్ కమిషనర్ హేమవతి మంగళవారం కార్పొరేటర్ గల్లా చిన్న తో కలిసి, వార్డ్ అభివృద్ధి ని పరిశీలించారు. మౌలిక వసతులు ఏ విధంగా అభివృద్ధి పరిచారో, స్థానిక ప్రజలను అడిగి ఆమె స్వయంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు సెక్రటరీ గూడెల కృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు వి. రమణ, బొండ కృష్ణ నాగరాజు, నవీన్, ధనుంజయ్, కనక, మహిళా ప్రెసిడెంట్ కురుమంగ, మహిళా వైస్ ప్రెసిడెంట్ తులసి, మహిళా సెక్రటరీ దేవి, కూటమి నాయకులు బిజెపి నాయకుడు రాజారావు, జనసేన నాయకులు, నానాజీ,లలిత, నాగరాజు, మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.







# ఆరోగ్యకరమైన ఆహారం అందురూ భుజించాలి

- ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం అవసరం - సమస్త జీవరాశినీ కాపాడుకోవాలి

- ఏ జీవి అంతరించినా మానవాళికే ముప్పు - పేరి రామకృష్ణ, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్



**విశాఖపట్నం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

ఆరోగ్యకరమైన ఆహారం అందురూ భుజించాలి అని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరి రామకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం అనకాపల్లి జిల్లా బుచ్చయ్య పేట మండలం లోని కెపి అగ్రహారంలో తాను చేస్తున్న ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం చూసేందుకు వచ్చిన వారితో ఆయన మాట్లాడారు. అయిదు అంచేల విధానం లో భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేస్తూ వ్యవసాయం చేస్తున్నామన్నారు. అనంతరం పంటలూ, గట్టు వ్యవసాయ విధానం అమలు చేస్తున్నామని వివరించారు. ఈ వ్యవసాయం చూస్తూ, పని చేస్తూ ముందుకు వెళ్తేనే అర్థం అవుతుంది అన్నారు. ప్రస్తుతం శీతోష్ణస్థితి వేడెక్కడం వల్ల కలిగే నష్టం అధిగమించడానికి ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం అవసరం అని పేర్కొన్నారు. అలాగే సమస్త జీవరాశినీ కాపాడుకోవాలి అని వివరించారు. పుడమి మీద ఏ జీవి అంతరించినా మానవాళికే ముప్పు ఏర్పడుతుంది అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జలగం కుమారస్వామి మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం వల్ల ఆదాయం పెరుగుతుంది, ఆరోగ్యం మెరుగుపడుతుంది అని వివరించారు. అందుకే తాము జాతీయ స్థాయిలో ప్రచారం చేస్తున్నామన్నారు. సమస్త జీవరాశినీ కాపాడుకోవాలని ప్రచారం చేస్తున్నామన్నారు. ఈ వేసవిలో సమస్త జీవరాశికి నీరు అందుబాటులో ఉంచాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో మేంగొ మేన్ అప్పాజీ, వారాహి ఫెడరేషన్ ప్రతినిధి రాహూల్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు పాల్గొన్నారు.

# మట్టి మాఫియాకు బలైన యువకుడు




**కందుకూరు, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

మండలంలోని కొండికందుకూరు గ్రామంలో మట్టి మాఫియా అక్రమంగా గ్రావెల్ కోసం తీసిన గుంటలో పడి యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. గ్రామానికి చెందిన బక్కమంతుల ప్రసాద్ సోమవారం సాయంత్రం (19) గేదెలను మేపుకుంటూ ఉండగా గేదెలు చెరువులో దిగడంతో ప్రసాద్ గేదెల కోసం చెరువులో దిగడంతో మట్టి తీసిన గుంటలు లోతుగా ఉండటం ప్రసాద్ కు ఈత రాకపోవడంతో ప్రాణాలు కోల్పోయినట్లు బంధువులు తెలిపారు. చెరువుల్లో అక్రమంగా మట్టి తరలించే క్రమంలో లోతుగా గుంతలు తీయడంతో ఈ ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. యువకుడు మృతి చెందడం తో గ్రామములో విషాదఛాయలు అలుముకున్నాయి. చేతి కందిన కొడుకు అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

# నూకాంబిక అమ్మవారి సన్నిధిలో సిరి సహస్ర



**విశాఖపట్నం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

భీమునిపట్నం పరిధిలోని పి.ఎం.పాలెం ఆర్చ్ కాలనీలో కొలువై ఉన్న నూకాంబిక అమ్మవారి పండుగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. పోతిన ప్రసాద్ ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర మంగళవారం పండుగలో పాల్గొని మ్రొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సిరమ్మకు 6వ వార్డు ఇంచార్జి పోతిన ప్రసాద్, నూకాంబిక అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ముఖ్య నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె నూకాంబిక అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి పండితుల ఆశీర్వాదం పొందారు. తదనంతరం కమిటీ ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని సిరమ్మ స్వయంగా భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, భక్తులు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను చెల్లించి 50 శాతం వడ్డీ పై రాయితీని పొందండి

ఈ సదవకాశాన్ని ఆస్తిపన్నుదారులు మార్చి 31 లోగా వినియోగించుకోండి.

-జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని గృహ యజమానులకు/ ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ముఖ్య విజ్ఞప్తి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆస్తిపన్ను చెల్లింపు పై 50 శాతం వడ్డీ మాఫీ చేస్తూ జి.ఓ.యం.యస్. నెం. 58 ఎం.ఏ. ఑ యు.డి. (సి2) డిపార్టుమెంటు, తేది. 16- 03- 2026 న ఉత్తర్వులు జారీ చేసిందని,ఈ సదవకాశాన్ని ఆస్తిపన్నుదారులు మార్చి 31 లోగా వినియోగించుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి, జి.వి.యం.సి. కి చెల్లించవలసిన ఇంటిపన్నులు, ఖాళీ జాగా పన్నుల బకాయిలు మరియు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అనగా 2025-26 సంవత్సరంనకు చెల్లించవలసిన పన్నులు తేది 31.03.2026 లోగా ఏక మొత్తముగా ఒకే సారి చెల్లించిన యెడల వాటిపై విధించబడిన వడ్డీనందు 50 శాతం మినహాయింపును పొందవచ్చునన్నారు. కావున, విశాఖ నగర పరిధిలోని గృహ యజమానులు/ ఆస్తిపన్ను చెల్లింపుదారులు ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశం వినియోగించుకొని జి.వి.యం.సి.కి చెల్లించవలసిన ఇంటిపన్నులు, ఖాళీ జాగా పన్నుల బకాయిలు వెంటనే చెల్లించి, 50 శాతం వడ్డీ రాయితీని పొందవలసినదిగా కోరడమైనదని జీవీఎంసీ కమిషనర్ తెలియజేశారు. ఈ సదావకాశం తేది 31.03.2026 వరకు మాత్రమేనని తెలియజేశారు. నగర ప్రజలు సౌకర్యార్థం, ప్రతీ వార్డు సచివాలయ పరిధిలోని ప్రతీ గృహ ఇంటి యజమానిని వారి గృహము వద్దనే వార్డు సచివాలయ కార్యదర్శి వచ్చినప్పుడు / సంప్రదించినప్పుడు వారి యొక్క ఆస్తిపన్ను బకాయిలను డెబిట్ / క్రెడిట్ కార్డ్ లేదా యు.పి.ఐ. ద్వారా గాని చెల్లింపులు జరుపవచ్చునన్నారు. మరియు ఈ దిగువ బ్యాంకులు మరియు జి.వి.యం.సి ప్రధాన కార్యాలయం అలాగే అన్ని జోనల్ కార్యాలయాల్లో సౌకర్యం కేంద్రముల వద్ద ఆస్తిపన్ను చెల్లింపుదారులు తమ పన్ను బకాయిలను పని వేళల్లో చెల్లించవచ్చునని తెలిపారు. ఐడిబిఐ-సిరిపురం బ్యాంక్ బ్రాంచ్ ఐ.సి.ఐ.సి.ఐ.-ద్వారకానగర్ బ్రాంచ్ పంజాబ్ నేషనల్ బ్యాంకు-మధురవాడ బ్రాంచ్ యాక్సిస్ బ్యాంకు-రామ్ నగర్ బ్రాంచ్ పనివేళలో అలాగే జి.వి.యంసి. ప్రధాన కార్యాలయము,అన్ని జోనల్ కార్యాలయములలో గల సౌకర్యం కేంద్రములు. ఆదివారం ,సాధారణ సెలవు దినములలో కూడా ఉదయం గం.8.00 లనుండి సాయంత్రం గం.8.00 ల వరకు తేది 31.03.2026 వరకు పనిచేయబడునన్నారు. కావున నగరములోని గృహ / ఇంటి యజమానులు జి.వి.యం.సి.కి చెల్లించవలసిన ఇంటిపన్నులు, ఖాళీ జాగా పన్ను చెల్లింపు దారులు ఈ సదావకాశమును వినియోగించుకొని తేది 31.03.2026 లోగా చెల్లించి వడ్డీ రాయితీని పొంది నగర అభివృద్ధిలో కార్పొరేషన్ కు చేయూతనందించ వలసినదిగా జీవీఎంసీ కమిషనర్ తెలియజేశారు.

# ఘనంగా జామియా మజీద్ లో షబ్-ఎ-ఖదర్(లైలతుల్ ఖదర్)

సుందరంగా అలంకరించిన మజీద్




**గిద్దలూరు, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

గిద్దలూరు పట్టణంలో రంజాన్ మాసపు 27వ రోజు సందర్భంగా పవిత్రమైన షబ్-ఎ-ఖదర్ (లైలతుల్ ఖదర్) ను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణంలోని అన్ని మసీదులను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. సోమవారం రాత్రి నుంచే పెద్ద సంఖ్యలో ముస్లింలు మసీదులకు చేరుకుని ప్రత్యేక నమాజులు, ప్రార్థనలు నిర్వహించారు. రాత్రంతా జాగరణ చేస్తూ అల్లాహ్ ప్రార్థనల్లో నిమగ్నమయ్యారు. ఇస్లాం మత విశ్వాసాల ప్రకారం రంజాన్ నెలలో అత్యంత పవిత్రమైన రాత్రిగా భావించే లైలతుల్ ఖదర్ రోజునే దివ్య ఖురాన్ అవతరించిందని ముస్లింలు నమ్ముతారు. అందుకే ఈ రాత్రిని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ అల్లాహ్ దయకరుణలు కోరుకున్నారు. ఈ పవిత్ర రాత్రి భక్తితో ప్రార్థనలు చేసిన వారికి సుమారు 83 సంవత్సరాల పాటు ప్రార్థనలు చేసిన ఫలితం లభిస్తుందని మతపరమైన విశ్వాసం ఉంది. అలాగే ఈ రాత్రి చేసే ప్రార్థనల వల్ల సర్వపాపాలు క్షమించబడతాయని ముస్లింలు విశ్వసిస్తారు. అందువల్ల గిద్దలూరులోని మసీదులన్నీ భక్తులతో కిటకిటలాడుతూ ఆధ్యాత్మిక ఉత్సాహంతో షబ్-ఎ-ఖదర్ వేడుకలు కొనసాగాయి.

# దివ్యాంగులకు శుభవార్త..!!

- నేటి నుండి ఫ్రీ బస్ సదుపాయం



**విశాఖపట్నం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దివ్యాంగులకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 18 బుధవారం నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో పూర్తి ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చింది. 'దివ్యాంగ శక్తి' పేరుతో ప్రారంభమవుతున్న ఈ పథకం ద్వారా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ బస్సుల్లో దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ పథకానికి అర్హతగా కనీసం 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం ద్వారా వేలాది మంది దివ్యాంగులకు ఉపశమనం కలగనుందని అధికారులు తెలిపారు. రోజువారీ ప్రయాణ ఖర్చులు తగ్గడంతో పాటు విద్య, ఉపాధి, వైద్య సేవలకు చేరుకోవడం మరింత సులభం కానుంది. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని పేర్కొన్నారు.

# తిరుపతిలో మహిళల అరెస్టులపై అనకాపల్లిలో నిరసన

- టిటిడి చైర్మన్ పదవికి బి.ఆర్. నాయుడు తక్షణమే రాజీనామా చేయాలి

- ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కూండ్రపు కృష్ణం నాయుడు డిమాండ్...



**పరవాడ, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

తిరుపతిలో మహిళలపై నమోదైన కేసులు,అరెస్టులకు నిరసనగా అనకాపల్లిలో వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపిన మహిళలపై చర్యలు తీసుకోవడం అన్యాయమని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, వైకాపా అనకాపల్లి జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్ల అనురాధ ఆధ్వర్యంలో అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కూండ్రపు కృష్ణం నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూండ్రపు కృష్ణం నాయుడు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ శాంతియుతంగా తమ అభిప్రాయాలను వ్యక్తపరచే హక్కు ఉందని పేర్కొన్నారు. మహిళలు చేపట్టిన నిరసనలను అణచివేయడం, అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేయడం, పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాలను ప్రయోగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. వెంటనే ఈ చర్యలను ఉపసంహరించుకుని అరెస్టు చేసిన మహిళలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అలాగే టిడిపి వర్గాల ప్రేరేపణతో ఈ అరెస్టులు జరిగాయని ఆరోపిస్తూ, టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా స్థాయిలో పార్టీ ముఖ్య నేతలు, నాయకులు, మహిళా నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేస్తూ నిరసనను విజయవంతం చేశారు.



# పిల్లలకు రుచికరమైన భోజనం అందించాలి



**పీసీపల్లి, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పిల్లలకు మంచి విద్యతో పాటు రుచికరమైన భోజనం పెట్టాలని వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య అన్నారు. మంగళవారం కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు వెంగళాయపల్లి ఎలిమెంటరీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. పిల్లలకు మంచి విద్యతో పాటు రుచికరమైన భోజనం పెట్టాలని అన్నారు. ఆయన వెంట మాజీ మండల పార్టీ అధ్యక్షులు చెన్నుపాటి అంజయ్య, ఒంగోలు పార్లమెంట్ బీసీ సెల్ కార్యదర్శి కోమటిగుంట్ల వీరయ్య, విద్యా కమిటీ చైర్మన్ చెన్నుపాటి వీరయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కరణం వెంకటేశ్వర్లు ఉన్నారు.

# యస్సీఆర్పీసి కమిటీ నియామక జీఓ రద్దు..!!

**-ఐయుకేయఫ్ హర్షం**



**విజయనగరం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మెన్, సభ్యుల నియామక జీఓ ఇచ్చిన ప్రభుత్వం అనేక అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో ముఖ్యమంత్రి స్పందించి వెంటనే జీఓను వెనక్కి తీసుకోవడం రాష్ట్ర చరిత్రలోనే గొప్ప విషయమని ముఖ్యమంత్రి అభినందనీయులని ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ రాష్ట్ర అద్యక్షుడు, బాలల హక్కుల రక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి మమ్ముల తిరుపతిరావు కొనియాడారు.మంగళవారం ఉదయం స్థానిక ఆర్ అండ్ బి దగ్గర కలాం ఫౌండేషన్ కార్యాలయంలో స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ యస్సీ, యస్టీ కమీషన్ల ఛైర్మన్, సభ్యులను ప్రభుత్వమే నేరుగా నియామకం చేస్తుందని, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కు మాత్రం నిబంధనలను అనుసరించి నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులను ఆహ్వానించి సంబంధిత ఎంపిక కమిటీ మౌఖిక పరీక్ష నిర్వహించి తుది జాబితాను తయారు చేసి నియామక జీఓ జారీ చేస్తారని తెలిపారు. కమిటీలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి, ఆ శాఖ ఉన్నతాధికారితో పాటు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి ఒకరు ఉంటారని అన్నారు. 2016లో కూడా తెదేపా ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా నిబంధనలను అనుసరించే ఎంపిక ప్రక్రియ జరిగిందని అర్హులైన వారినే నియిమకం చేసారని అన్నారు. కానీ గత వైకాపా ప్రభుత్వం కమిషన్ ఛైర్మన్ గా కొద్దిగా అనుభవం ఉన్న వ్యక్తినే ఎంపిక చేసినా సభ్యులుగా తమ పార్టీ నాయకుల సిఫార్సులతో వేసారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి బాలల హక్కుల పరిరక్షణకు క్రుషి చేస్తున్నారని, అందులో భాగంగానే నాణ్యమైన విద్య, నాణ్యమైన ఆహారం అందిస్తూ బాలలకు స్వేచ్ఛగా జీవించే హక్కును రక్షిస్తున్నారని అన్నారు. కానీ రాష్ట్రంలో కొందరు అధికారులు ముఖ్యంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పాత ప్రభుత్వ ఆలోచనలతో నడుస్తున్నారని, ఆర్థిక అవకతవకలకు పాల్పాడుతూ ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా పని చేస్తున్నారని తెలిపారు. ఈ కమిటీ నియామకం కూడా నిబంధనలను తుంగలో తొక్కి అసలు ధరఖాస్తే చేయని, ఇంటర్వ్యూకి హాజరు కాని వ్యక్తిని ఛైర్మన్ గా, పాత కమిటీలో ఉన్న ఇద్దరు సభ్యులను కొనసాగిస్తూ, ఒకే ప్రాంతానికి చెందిన వారిని నియమించడం వెనుక లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. అధికారులు అవకతవకలకు పాల్పడి నియమించిన కమిటీ మీద వెల్లువెత్తిన ఆరోపణలను గ్రహించి వెంటనే స్పందించి జీఓను వెనక్కి తీసుకోవడం ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమని,ముఖ్యమంత్రి నిర్ణయం రాష్ట్రంలోనే ఒక చరిత్ర స్రుష్టించందని అన్నారు.ఆర్థిక అవకతవకలకు పాల్పడిన స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులపై విచారణ జరిపి తత్సంబంధిత మంత్రి వారిపై తగు చర్యలు తీసుకోవాలని, స్వయంగా ముఖ్యమంత్రే ఈ కమిటీ నియామంలో స్పందించినందున తగిన అర్హతలు, బాలల హక్కుల కోసం పన చేస్తున్న స్వచ్ఛంధ సంస్థలతో ఓ మంచి కమిటీయే వవస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ ఫత్రికా సమావేశంలో ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ జిల్లా అద్యక్షుడు జాగరపు ఈశ్వరప్రసాద్, సహకార భారతి మన్యం జిల్లా కన్వీనర్ మత్రాపు జగదీష్, మాత్రుభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, వైబ్రేంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజషన్ జిల్లా కన్వీనర్ నాగిరెడ్డి జగన్మోహిని పాల్గొన్నారు.

# బహిరంగ వేలంపాటలో నారాయణస్వామి ఆదాయం రూ.19.94 లక్షలు



**సి ఎస్ పురం, ఇన్నర్ వ్యూ, మార్చి 17**

మండలంలోని కోవిలంపాడు పంచాయతీ పరిధిలో గల మిట్టపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ నారాయణస్వామి దేవస్థాన ఆవరణలో మంగళవారం ఆగిన దుకాణాల నిర్వహణ హక్కులకు బహిరంగ వేలంపాటలు నిర్వహించగా రూ.19,94,100/- లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహ బాబు తెలిపారు ఈ వేలంపాటలను కందుకూరు డివిజన్ ఇన్స్పెక్టర్ జి.ఏ. సత్యనారాయణ మరియు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ సమక్షంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు మాట్లాడుతూ ఇటీవల వేలంపాటలో నిలిచిపోయిన దుకాణాలకు బహిరంగ వేలంపాటలు నిర్వహించగా కొబ్బరికాయలు మరియు పూజా ద్రవ్యాలు అమ్ముకొను హక్కు రూ.7,30,000కు, ఫ్యాన్సీ ఐటమ్స్ అమ్ముకొను హక్కు రూ.4,28,000కు, గ్యాస్ పొయ్యిలు అద్దెకు ఇచ్చుకొను హక్కు రూ.3,15,000కు గాజులు అమ్ముకొను హక్కు రూ.2,20,000కు, చిల్లర సరుకులు అమ్ముకొను హక్కు రూ.2,30,000కు, పడి బియ్యం ప్రోగు చేసుకొను హక్కు రూ.55,000కు, పాదరక్షలు భద్రపరుచుకొను హక్కు రూ.10,100 కు హెచ్చు పాటదారులు పాడినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో పాటదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మైలవరం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి లోకేష్

**- మధ్యాహ్న భోజనం నాణ్యత స్వయంగా పరిశీలన**

**-తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరిక.**

**- విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుకు చర్యలు చేపట్టాలని ఆదేశం**



**మైలవరం, మార్చి 27,ఇన్నర్ వ్యూ ప్రతినిధి (ఎంబికె):**

ఎన్టీఆర్ జిల్లా,మైలవరం దేవునిచెరువు,తారకరామా నగర్, మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఇటీవల మధ్యాహ్న భోజనం బాగాలేదంటూ పాఠశాల హెచ్ఎం డ్రామా ఆడించిన ఘటన నేపథ్యంలో మంత్రి ఆకస్మిక తనిఖీ చేపట్టారు.విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తిని నాణ్యతను పరిశీలించారు.కొత్తగా ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ అందిస్తున్న భోజనం నాణ్యతపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.భోజనం బాగుందని విద్యార్థులు చెప్పారు. ఘటన జరిగిన రోజు, అంతకుముందు భోజనం ఎలా ఉందని విద్యార్థులను మంత్రి అడిగారు. భోజనం బాగాలేకపోతే ముందు తల్లిదండ్రులకు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. ఆ తర్వాత భోజనం నాణ్యతపై లీప్ యాప్ ద్వారా తల్లిదండ్రుల అభిప్రాయాలు తెలుసుకుంటామని చెప్పారు. ఇంకోసారి తప్పు జరగకుండా చూసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఇటీవల మధ్యాహ్న భోజనం సరిగా లేదంటూ ఆహారాన్ని విద్యార్థులు డస్ట్ బిన్ లో పడేసిన ఘటనపై సిబ్బందిని ఆరా తీశారు. భోజనం సిద్ధమయ్యాక ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యత పరిశీలిస్తున్నారా అని వాకబు చేశారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రశ్నించారు.

**తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవు**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మీపై పవిత్ర బాధ్యత ఉంది. చిన్న సమస్య ఉన్నా తెలుసుకోవాలి, పరిష్కరించాలి. తప్పు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని, నిర్లక్ష్యంగా ఎవరూ వ్యవహరించవద్దని మంత్రి హెచ్చరించారు. భోజనం నాణ్యతపై ప్రతివారం తల్లిదండ్రులకు ఫోన్ చేయాలని, ఐవీఆర్ఎస్ ద్వారా వారి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యాబోధన తీరు, పాఠశాల పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ప్రతి పాఠశాల తనకు ముఖ్యమేనని, అడ్మిషన్ల పెంపుతో పాటు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పాఠశాలలో ఉన్న అంగన్ వాడీ కేంద్రాన్ని మంత్రి సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న ఆహారాన్ని, అంగన్ వాడీ కేంద్రం పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.మైలవరం ఘటన నేపథ్యంలో విద్యార్థులకు అందే మధ్యాహ్న భోజనం పథకంపై ఇటీవల సమీక్షించిన మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యంగా లేకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భోజనం సిద్ధమయ్యాక ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు నాణ్యత పరిశీలించాలని, బాగుందని నిర్ధారించాకే విద్యార్థులకు పెట్టాలని ఆదేశించారు. వారంలో ఒకరోజు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలో ఒక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయాలన్నారు. భోజనం గురించి విద్యార్థులు చెబితే తల్లిదండ్రులు వెంటనే లీప్ యాప్ ద్వారా ఫిర్యాదులు, సూచనలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సమూల మార్పు కోసం త్వరలోనే సెంట్రలైజ్డ్ కిచెన్ వ్యవస్థను యుద్ధప్రాతిపదికన ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్

**రాష్ట్ర వైఎస్ఆర్ సి పి అధికారిక ఇఫ్తార్**

**- రాష్ట్ర వైఎస్ఆర్ సి పి. మైనారిటీ కార్యదర్శి బాజీ బాబా**



**విజయవాడ వెస్ట్, మార్చి 17,ఇన్నర్ వ్యూ ప్రతినిధి (ఎంబికె ) :**

విజయవాడ పశ్చిమ నియోజకవర్గం,55వ డివిజన్ లో జరిగిన పత్రికా సమావేశం లో, వైఎస్ఆర్ సి పి.రాష్ట్ర అధికార ప్రతినిధి బాజీ బాబా మాట్లాడుతూ...,బుధవారం అనగా 18 -3 .2026 సాయంత్రం 5.గంటలకు బందర్ రోడ్ లో గల వైవి రావు హాస్పటల్ రోడ్డు ఎస్ ఎస్ కళ్యాణ మండపం నందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇఫ్తార్ ఏర్పాటు చేసినది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, రాష్ట్రంలో ఉన్న వైఎస్ఆర్సిపి నాయకులు మాజీ మంత్రిలు,మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల సమన్వయ కర్తలు అందరూ పాల్గొంటారని,పవిత్ర రంజాన్ ఉపవాస దీక్ష విరమణ,రాష్ట్రం,జిల్లాల లో నియోజకవర్గాలలో, ఉన్న మసీదులు కమిటీల వారికి,మౌలానాలకి, ఇమామ్లకి,మరియు రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులకు కార్యకర్తలకు, అందరికీ ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమానికి విచ్చేస్తున్న ప్రతి ఒక్కరిని ప్రేమతో ఆహ్వానించి, అందరం ఒక్కటని, అందరం సోదర భావంతో మెలగాలనే ఆలోచనతోనే,ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.సర్వమతాల సారం ఒక్కటేనని,ఉపవాస దీక్షలు ఆరాధన ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ,సోదరభావం,మానవత్వం వంటి సద్గుణాలను,పెంపొందించడమే, రంజాన్ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.అందువల్ల మైనార్టీ సోదరులు,ఈ మాసాన్ని ఎంతో, పవిత్రంగా భావిస్తారన్నారు.అలాగే ముస్లిం సోదరులందరూ ఎంతో నిష్టగా ఉపవాసం ఉండి ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ అల్లా మన్ననలు పొందాలన్నారు.ప్రతి ఒక్కరూ పవిత్ర రంజాన్ మాసంలో రంజాన్ పవిత్రతను గుర్తించి అల్లా అనుసరించిన మార్గంలో నడవాలన్నారు.

# ఘనంగా ముగిసిన జీవీఎంసీ కౌన్సిల్ వీడ్కోలు సభ

**2021-26 జీవీఎంసీ కౌన్సిల్ ఎప్పటికీ చరిత్రలో స్ఫూర్తిదాయకంగా మిగిలిపోతుందన్న దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్.**

**విశాఖ నగర అభివృద్ధి దిశగా ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగిందని పేర్కొన్న మేయర్ పీలా శ్రీనివాసరావు.**

**కౌన్సిల్ కాలంలో 15000 కోట్లు అభివృద్ధి పనులను సాధించి జీవీఎంసీ చరిత్రలో ఒక స్థానాన్ని సంపాదించుకుందని వెల్లడించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.**

**ప్రజలు అందించిన ఐదు సంవత్సరాల సదవకాశంతో విశాఖ నగర అభివృద్ధికి పని చేసే భాగ్యం కలిగిందని పేర్కొన్న ఫ్లోర్ లీడర్లు,కార్పొరేటర్లు.**



**విశాఖపట్నం, ఇన్నర్ వ్యూ,మార్చ్ 17**

2021-26 జీవీఎంసీ కౌన్సిల్ కు ఘన వీడ్కోలు సభా కార్యక్రమాన్ని ఋషికొండ సమీపంలో సాయి ప్రియా రిసార్ట్లో ముఖ్యఅతిథి దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్, విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్లు దల్లి గోవిందరాజు, కట్టమూరు సతీష్ , అన్ని పార్టీలకు ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు తో కలిసి జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ 2021 - 26 జీవీఎంసీ కౌన్సిల్ చరిత్రలో ఎప్పటికీ మిగిలిపోతుంది అన్నారు. విశాఖ నగర అభివృద్ధి దిశగా మేయర్లు, డిప్యూటీ మేయర్లు, ఫ్లోర్ లీడర్లు,వార్డు కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు ప్రజల సేవల దిశగా విశాఖ నగర అభివృద్ధికి నిత్యం కృషి చేస్తూ విశాఖ నగర కీర్తిని మరింత పెంచారన్నారు. ప్రపంచ దేశాలు నేడు విశాఖ నగరం వైపు చూస్తున్నాయని ఆ దిశగా జీవీఎంసీ కౌన్సిల్ పనితీరు ఎప్పటికీ అందరికీ గుర్తుండిపోతుందన్నారు. ప్రజలకు సేవ చేసేలా నగర అభివృద్ధికి కృషి చేసినప్పుడు ఆ వ్యక్తికి గౌరవం మరింత పెరుగుతుందన్నారు. ఎప్పుడు గౌరవంగా జీవించే పదవులను అందరూ చేపట్టాలని ఈ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ నగర మేయరుగా పీలా శ్రీనివాసరావు తక్కువకాలం పదవిలో ఉన్నప్పటికీ ఆ కాలంలో విశాఖ నగర అభివృద్ధికి ఎన్నో పనులను మంజూరు చేయడం ద్వారా చరిత్రలో మిగిలిపోతారు అన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని జీవీఎంసీ కమిషనర్ నిర్వహించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు ఎమ్మెల్యే కమిషనర్ కు తెలిపారు. అనంతరం నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల ఓట్లతో జీవీఎంసీ కౌన్సిల్లో అడుగుపెట్టి విశాఖ నగర అభివృద్ధికి సేవలందించినందుకు చాలా తృప్తినిచ్చిందని, ఈరోజు కౌన్సిల్ పెడుతున్నందుకు బాధగా ఉన్న ప్రజాసేవకు అంకితమైనందుకు ఆనందంగా ఉందన్నారు. కార్పొరేటర్లు జీవీఎంసీ కమిషనర్, అధికారులు, ఉద్యోగులు ఒక కుటుంబంలో విధులు నిర్వహిస్తూ ఈ కౌన్సిల్ ను నడిపినందుకు ఆనందంగా ఉందన్నారు. యోగాంధ్ర, సిఐఐ సమ్మె టు, ఐఎఫ్ ఆర్, విశాఖ ఉత్సవ్ తదితర అంతర్జాతీయ కార్యక్రమాలకు జీవీఎంసీ కార్యాచరణ అమోఘమని, ప్రపంచ చరిత్రలో విశాఖ ఎప్పటికీ నిలిచి ఉంటుంది అన్నారు. పది నెలల 20 రోజుల్లో జీవీఎంసీ అభివృద్ధికి నా వంతు కృషి చేశానన్నారు. కౌన్సిల్ నడపడంలో తప్పొప్పులను సరిదిద్దానని ,ముఖ్యంగా ఎంపీ ,ఎమ్మెల్యేల సహకారం మరింత సంతోషాన్ని ఇచ్చిందన్నారు. రాజకీయాలు, పదవులు శాశ్వతం కాదని విశాఖ అభివృద్ధిలో భాగస్వామ్యమయి ప్రధాని ,రాష్ట్రపతులకు స్వాగతం పలికే అవకాశం లభించడం నా అదృష్టం అన్నారు. విశాఖ నగరానికి అవార్డు లభించినప్పుడు అవి అందుకునే సమయంలో చాలా ఆనందం పొందానన్నారు. రాజకీయం కన్నా ఎప్పుడూ ఒక మాటకు కట్టుబడి ఉంటానని జీవీఎంసీ యంత్రాంగం నగర అభివృద్ధికి నిరంతరం ఇలాగే కృషి చేస్తూ విశాఖ కీర్తి ప్రతిష్టలను మరింత పెంచాలని ఆ దిశగా జీవీఎంసీ కమిషనర్ సహకరిస్తున్న తీరు అభినందనీయమన్నారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ 15000 కోట్ల అభివృద్ధి పనులు ఈ కౌన్సిల్ సాధించిందని, జీవీఎంసీ చరిత్రలో ఎప్పటికీ నిలిచి ఉంటుందన్నారు. విశాఖ నగర్ మేయర్ పీలా శ్రీనివాసరావు అందించిన సహకారం మరువలేనిదని, కొంతమంది కౌన్సిల్ సభ్యులు సభలో మాట్లాడే పద్ధతి కొన్ని విషయాలను తెలుసుకునేలా చేసిందన్నారు. కౌన్సిల్లో గొడవలు, రగడ ఉన్న చాలా విషయాలు విశాఖ నగర అభివృద్ధి దిశకు నేర్చుకోవచ్చునన్నారు . ఐఏఎస్ కన్నా కార్పొరేటర్లకు ఎక్కువ అనుభవం ఉంటుందని, జీవీఎంసీ కి ఏ సమయంలోనైనా వచ్చి ప్రజా సమస్యలను తెలియపరచాలన్నారు. ముఖ్యంగా కౌన్సిల్ జరిగే సమయంలో పలువురు కార్పొరేటర్లు మాట్లాడే విషయాలను చాలా గ్రహించానని, అందులో గాడు చిన్ని లక్ష్మి కుమారి ,మూర్తి యాదవ్ ,వసంత లక్ష్మి, బాణాల శ్రీనివాస్ ,డిప్యూటీ మేయర్ సతీష్ , గంకల కవిత, డిప్యూటీ మేయర్ గోవిందరాజు ,పల్లా శ్రీనివాసరావు ,పులి లక్ష్మి భాయ్,గంధం శ్రీనివాసరావు,లేళ్ళ కోటేశ్వరరావు ,బొండా జగన్నాథం, రాపర్తి కన్నా ,పిసిని వరాహ నరసింహ, బిపిన్ జైన్, స్టాలిన్, గంగారాం , నీలి బాబు, అనూష ఇలా చాలామంది వారు మాట్లాడే తీరు, వార్డు అభివృద్ధి పట్ల వారికున్న చిత్తశుద్ధి స్వయంగా చూశానన్నారు. ఎప్పుడైనా ,ఎవరికైనా వార్డు పనుల మంజూరులో ఆలస్యం జరిగినా అందరూ పెద్ద మనసుతో మన్నించాలని కమిషనర్ తెలిపారు. జీవీఎంసీ కౌన్సిల్ కాలంలో కార్పొరేటర్లు ,మేయర్లు జీవీఎంసీ యంత్రాంగానికి అందించిన సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు కమిషనర్ తెలిపారు. అనంతరం డిప్యూటీ మేయర్లు కట్టమూరు సతీష్ ,దల్లి గోవిందరాజు, అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లు డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు మాట్లాడుతూ కౌన్సిల్ ప్రారంభంలోనే ప్రజలకు సేవ భాగ్యం కరోనా మంచి పని కల్పించిందని, ప్రజలు కార్పొరేటర్లను జీవీఎంసీ కి వారదులుగా పంపించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కౌన్సిల్ కాలంలో విశాఖ నగరం మరింత అభివృద్ధి చెందిందని సహకరించిన కమిషనర్లు అధికారులకు ఉద్యోగులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనర్లు డివి రమణమూర్తి, పీఎం సత్యవేణి, ఎస్ఎస్ వర్మ, పి నల్లనయ్య , కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ ఈ కౌన్సిల్ కాలంలో కార్పొరేటర్ల నుండి ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకోగలిగామని వాటిని పరిష్కరించే అవకాశం లభించినందుకు ఆనందంగా ఉందని ఈ కౌన్సిల్ ఎప్పుడు చరిత్రలో అందరికీ గుర్తుండేలా మిగిలిపోతుందని పేర్కొన్నారు. అనంతరం నగర మేయర్ కు, డిప్యూటీ మేయర్ లకు, ఫ్లోర్ లీడర్లకు, కార్పొరేటర్లకు, గాజువాక శాసనసభ్యులు, జీవీఎంసీ కమిషనర్ , జివిఎంసి అధికారులు సత్కరించి జ్ఞాపకం పంపించి అభినందనలు తెలిపారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ను గాజువాక శాసనసభ్యులు,మేయర్, డిప్యూటీ మేయర్లు కార్పొరేటర్లు దుస్సాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వారి కుటుంబ సభ్యులు, జీవీఎంసీ అధికారులు, ఇంజనీర్లు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐకాన్ స్టార్ నుంచి గ్లోబల్ ఐకాన్ గా!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కెరీర్‌లో అత్యంత కీలకమైన దశలో ఉన్నారు. రాబోయే ఐదేళ్లలో ఆయన లైనప్‌లో ఉన్న సినిమాలన్నీ అనుకున్నట్లుగా విడుదలై బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తే టాలీవుడ్ స్టార్‌గానే కాకుండా, భారతీయ చిత్ర పరిశ్రమలోనే అజేయమైన గ్లోబల్ ఐకాన్ గా ఎదిగే అవకాశం ఉంది. -పుష్ప-తో ఇప్పటికే పాన్-ఇండియా మార్కెట్‌ను శాసించిన బన్నీ, రాబోయే చిత్రాలతో తన ప్రభావాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది.వచ్చే ఐదేళ్లలో ఆయన లోకేష్ కనగరాజ్, సుకుమార్, త్రివిక్రమ్, సందీప్ రెడ్డి వంగా వంటి అగ్ర దర్శకులతో చేయబోయే సినిమాలు బాక్సాఫీస్ వద్ద వేల కోట్ల వరకు వసూళ్లను సాధించే అవకాశం ఉంది. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే గనుక భారతీయ సినిమా చరిత్రలో అత్యధిక కమర్షియల్ స్టామినా ఉన్న హీరోగా బన్నీ నిలుస్తారు. ముఖ్యంగా హిందీ మార్కెట్‌లో బన్నీకి ఉన్న క్రేజ్ అమీర్ ఖాన్, షారుఖ్ ఖాన్ రేంజ్‌కు చేరుకోవడమే కాకుండా, సౌత్ నుంచి నార్త్ వరకు ఏకఛత్రాధిపత్యం వహించే మెగా పాన్-ఇండియా సూపర్ స్టార్ గా బన్నీ అవతరిస్తారు. సాంకేతికంగా , నటన పరంగా కూడా బన్నీ సరి కొత్త శిఖరాలను అధిరోహిస్తారు. త్రివిక్రమ్ సినిమాతో విజువల్ వండర్స్, సందీప్ వంగాతో రా అండ్ రస్టిక్ యాక్షన్ వంటి వైవిధ్యమైన జోనర్లు చేయడం వల్ల, ఆయన నటనలో ఉన్న అన్ని కోణాలు



కృతి శెట్టి: బేబీ పింక్‌లో బాడీ - గ్లామ్ ఫోటోషూట్ & రైజింగ్ ఫిల్మ్ కెరీర్



ప్రపంచానికి పరిచయమవుతాయి. ఇది కేవలం బాక్సాఫీస్ నంబర్లకే పరిమితం కాకుండా, గ్లోబల్ బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు ,అంతర్జాతీయ చలనచిత్ర వేదికలపై భారతీయ సినిమాకు ప్రతినిధిగా అల్లు అర్జున్‌ని నిలబెడుతుంది. రాజమౌళి సినిమాల తర్వాత ఆ స్థాయి ప్రభావాన్ని చూపగల సత్తా ఉన్న హీరోగా బన్నీ పేరు మారుమోగిపోతుంది.

ఈ ఐదేళ్ల విజయ పరంపర అల్లు అర్జున్‌ను టాలీవుడ్ నెంబర్ వన్ స్థానంలో తిరుగులేని వ్యక్తిగా మార్చేస్తుంది. రికార్డులే కాకుండా, తనకంటూ ఒక సొంత సామ్రాజ్యాన్ని సృష్టించుకుని, భవిష్యత్ తరాల నటులకు ఒక రోల్ మోడల్‌గా నిలిచే అవకాశాలున్నాయి. 2030 నాటికి భారతీయ చిత్ర పరిశ్రమ గురించి ఎక్కడ చర్చ జరిగినా? అల్లు అర్జున్ పేరు మొదటి వరుసలో ఉండటం ఖాయం. ఆ విజయం ఆయనను కేవలం ఒక నటుడిగానే కాకుండా, సినిమా మార్కెట్‌ను శాసించే ఒక మహోన్నత శక్తిగా తీర్చిదిద్దుతుంది. ప్రస్తుతం బన్నీ తమిళ దర్శకుడు అట్లీతో కలిసి ఓ గ్లోబల్ సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో బన్నీ మూడు-నాలుగు గెటప్స్ లో కనిపించ నున్నాడు? అన్న ప్రచారం సినిమాకు అంతకంతకు హైప్ తీసుకొస్తుంది. పాన్ వరల్డ్ లో ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.



## శివంగి వర్మ సొగసైన లుక్స్

# టీమిండియా టీ20 కెప్టెన్సీ రేసులో శ్రేయస్ అయ్యర్!



భారత జట్టు వరుసగా రెండోసారి టీ20 ప్రపంచకప్ గెలిచి సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ విజయంతో టీమిండియాకి ఐసీసీ ట్రోఫీ అందించిన కెప్టెన్ల జాబితాలో సూర్యకుమార్ యాదవ్ చేరాడు. ఈ టోర్నమెంట్ తర్వాత అతడు కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకుంటాడని, ఆటకు వీడ్కోలు పలికే ఛాన్స్ ఉందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. న్యూజిలాండ్ పై ఫైనల్లో గెలిచిన తర్వాత ఒలింపిక్స్-2028లో ఆడటమే తన లక్ష్యమని ఇప్పటికే సూర్య క్లియర్ గా చెప్పేశాడు. కెప్టెన్సీ వ్యవహారంపై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ఇండియన్ టీమ్ టీ20 కెప్టెన్ గా ఎవరూ ఊహించని పేరును ప్రతిపాదించాడు. జట్టులో చోటే లేని ప్లేయర్ కి జట్టు టీమ్ పగ్గాలు ఇవ్వాలని చెప్పడం గమనార్హం. కాగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024లో కోల్‌కతా నైట్‌రైడర్స్ కి టైటిల్ అందించిన కెప్టెన్ గా శ్రేయస్ అయ్యర్ నిలిచాడు. గతేడాది పంజాబ్ కింగ్స్ కి వెళ్లిన ఈ ముంబై బ్యాటర్.. ఆ జట్టును ఫైనల్ వరకు తీసుకెళ్లాడు. సారథిగా, బ్యాటర్ గా రాణించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. అయినప్పటికీ శ్రేయస్ ని సెలక్టర్లు పెద్దగా పట్టించుకోలేదు.. అతడు ఫామ్ లో ఉన్నప్పటికీ.. టీమ్ లో మాత్రం చోటు ఇవ్వలేకపోతున్నామని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ తేల్చి చెప్పారు. ఆసియా టీ20 కప్-టోర్నీకి జట్టుని ప్రకటించిన సందర్భంగా ఈ కామెంట్స్ చేశారు. ఇక టీ20 వరల్డ్ కప్ - 2026 జట్టులోనూ అయ్యర్ కి స్థానం లభించలేదు.

దేశీయ లీగ్స్, ఐపీఎల్లో సత్తా చాటిన శ్రేయస్ అయ్యర్ ని బీసీసీఐ సెలక్షన్ కమిటీ పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇలాంటి సమయంలో ఆకాశ్ చోప్రా మాత్రం అయ్యర్ భారత జట్టు టీ20 కెప్టెన్ ఎందుకు కాకూడదంటూ చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఐపీఎల్-2026లో పంజాబ్ కింగ్స్ సారథిగా, బ్యాటర్ గా

రాణిస్తే అతడికి మరో ఛాన్స్ దక్కుతుందని అన్నారు. శ్రేయస్ టీ20 వరల్డ్ కప్ స్క్వాడ్ లో ఉంటాడని నేను అనుకున్నాను.. మిడిలార్డర్ లో ఒకవేళ చోటు ఖాళీ అయితే కచ్చితంగా అది అతడికే దక్కేది అన్నారు. కాబట్టి త్వరలోనే శ్రేయస్ అయ్యర్ భారత టీ20 జట్టులోకి వచ్చే ఛాన్స్ కనిపిస్తుందన్నారు.ఇక కెప్టెన్సీ విషయానికొస్తే.. ఇండియన్ టీమ్ తదుపరి కెప్టెన్ గా శ్రేయస్ ఎందుకు ఉండకూడదు? అందుకు అవకాశం ఉందని ఆకాశ్ చోప్రా చెప్పుకొచ్చాడు.

# ముంబై ఇండియన్స్ ఫ్యాన్స్ కి గుడ్ న్యూస్.. టికెట్ల అమ్మకం షెడ్యూల్ రిలీజ్








మార్చి 28 నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు జరగనున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 మొదటి దశలో సొంతగడ్డపై జరిగే మ్యాచ్‌ల టిక్కెట్ల అమ్మకాల షెడ్యూల్‌ను ముంబై ఇండియన్స్ (మార్చి 17న) విడుదల చేసింది. బీసీసీఐ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. ముంబై ఇండియన్స్ తొలి దశలో మొత్తం నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది. మార్చి 29న ముంబైలోని వాంఖడే స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్ తో హోమ్ మ్యాచ్‌తో తమ జర్నీని స్టార్ట్ చేయనుంది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ పై ఇతర వేదికల్లో మ్యాచ్‌లను ఆడనుంది. ఆ తర్వాత మళ్లీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగే కీలక మ్యాచ్ ని వాంఖడే స్టేడియంలో ఆడనుంది.ఈ మ్యాచులకి సంబంధించిన టికెట్లు పూర్తిగా ఆన్‌లైన్‌లో దీశీశీనవీమాప్త్రశీష వెబ్‌సైట్, యాప్ ద్వారా ఎం-టికెట్ల రూపంలో మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఈసారి టికెట్ల విక్రయాన్ని నాలుగు దశల్లో నిర్వహించనున్నారు. మొదటి దశలో గూగుల్ పే ఉపయోగించే వినియోగదారులకు మార్చి 19 మధ్యాహ్నం 12 గంటల నుంచి మార్చి 21 మధ్యాహ్నం 12 గంటల వరకు టికెట్లు బుక్ చేసుకునే ఛాన్స్ కల్పించారు. రెండో దశలో ఎంఐ గోల్డ్, సిల్వర్, జూనియర్ మెంబర్లకు మార్చి 21 మధ్యాహ్నం 3 గంటల నుంచి మార్చి 22 మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ప్రకటించారు.

మూడో దశలో ఎంఐ బ్లూ మెంబర్లు, ముందుగా రిజిస్టర్ చేసుకున్న దీశీశీనవీమాప్త్రశీష యూజర్లకు మార్చి 22వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి మార్చి 23 సాయంత్రం 5 గంటల వరకు టికెట్లు అందుబాటులో ఉంటాయి. చివరి దశలో సాధారణ ప్రజలకు మార్చి 23వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి టికెట్ విక్రయం ప్రారంభమవుతుంది. మెంబర్‌షిప్ ద్వారా ముందస్తు బుకింగ్ సదుపాయం పొందాలంటే, మార్చి 19వ తేదీ రాత్రి 11:59 లోపు మెంబర్‌షిప్ తీసుకోవాలని ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ స్పష్టం చేసింది. అభిమానులకు ప్రాధాన్యత కల్పించేందుకు ఈ విధంగా దశలవారీగా టికెట్లు విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. ఇక ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ జట్టు ఇప్పటికే ప్రాక్టీస్ క్యాంప్‌ను స్టార్ట్ చేసింది.

# రాహుల్ ద్రవిడ్ డ్యాన్స్ సూపర్.. నన్ను పార్టీకి పిలవకపోయినా వెళ్లాను..





ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు భారత మాజీ ఫాస్ట్ బౌలర్ శ్రీశాంత్ తన క్రికెట్ కెరీర్‌లో జరిగిన ఆసక్తికర సంఘటనలను షేర్ చేసుకున్నాడు. ముఖ్యంగా టీమిండియా చేసుకునే పార్టీల గురించి చెప్పిన విషయాలు ఇప్పుడు క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. శ్రీశాంత్ మాట్లాడుతూ.. తమ కాలంలో మ్యాచ్‌లు గెలిచిన తర్వాత ప్లేయర్స్ ఎక్కువగా నైట్ పార్టీల్లో పాల్గొనేవారని చెప్పాడు. సీనియర్ ఆటగాళ్లు మాత్రం త్వరగా నిద్రపోవడాన్ని ఇష్టపడేవారని గుర్తు చేశాడు. సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్ లాంటి వారు త్వరగా నిద్రపోతారు.. కానీ సౌరభ్ గంగూలీ మాత్రం ఎక్కువగా తన గదిలోనే ఉండేవాడు.. భారీ విజయాలు సాధించినప్పుడు మాత్రం అందరం కలిసి సెలబ్రేట్ చేసుకునేవాళ్లమని శ్రీశాంత్ చెప్పుకొచ్చాడు.పాకిస్థాన్‌లోనే పాక్ పై సిరీస్ గెలిచిన సందర్భాన్ని మాజీ క్రికెటర్ శ్రీశాంత్ గుర్తు చేసుకుంటూ.. ఆ సిరీస్ నా ఫస్ట్ విదేశీ టూర్.. ఆ రోజు మాత్రం అందరం కలిసి రాత్రి పొద్దుపోయే వరకు ఎంజాయ్ చేశాం.. ఈ సందర్భంగా రాహుల్ ద్రవిడ్ గురించి ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. రాహుల్ భాయ్ చాలా బాగా డాన్స్ చేస్తాడు.. ఇది చాలా మందికి తెలియదన్నాడు. మైదానంలో కూల్‌గా, క్రమశిక్షణతో కనిపించే ద్రవిడ్‌కు ఈ టాలెంట్ ఉందని చెప్పడంతో ఫ్యాన్స్ ఆశ్చర్యపోతున్నారు. అంతేకాదు, 2008 ఐపీఎల్ ఫైనల్ తర్వాత జరిగిన పార్టీకి నన్ను ఆహ్వానించలేదు, అయినప్పటికీ నేను వెళ్లినట్ల శ్రీశాంత్ గుర్తు చేసుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య ఫైనల్ మ్యాచ్ తర్వాత పార్టీ జరిగింది.. ఆ పార్టీకి నాకు ఆహ్వానం లేకపోయినా 'పర్పుల్ క్యాప్' కోసం వెళ్లాను.. షేన్ వార్న్ లాంటి లెజెండ్స్ అక్కడ ఉండడంతో నేను కూడా పార్టీలో పాల్గొన్నట్లు తెలిపాడు. ఆ సీజన్‌లో శ్రీశాంత్ 19 వికెట్లు తీసుకోగా, పాకిస్థాన్ బౌలర్ సోహైల్ తన్వీర్ 22 వికెట్లతో పర్పుల్ క్యాప్ దక్కించుకున్నాడు. 2008లో రాజస్థాన్ రాయల్స్ జట్టు షేన్ వార్న్ నాయకత్వంలో టైటిల్ గెలుచుకుంది.

Printed, Published and Owned by Mulakalapalli Raju, Published at: Plot No: 78, E. Bonangi Village, Paravada Post & mandal Anakaplli Dist-531021, Andhrapradesh.. Printing at : Sri Sai Ganga Printers and Publications, Flat No: 504, Bharat Towers, 5Th lane, Dwaraka Nagar, Visalhapatnam -530016, Andhrapradesh. RNI : APTEL: 16373
Editor : Mulakalapalli Raju e-mail: rajumds777@gmail.com, Moble:7997947777